నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ఆదివారం
31.12.2023




# కొత్త సంవత్సరం వచ్చేసింది

## ఛైర్మన్‌తో ముఖాముఖి



**నూకారపు సూర్యప్రకాశరావు**
**ఛైర్మన్, నేటి దిన పత్రిక సూర్య**

**దేశ ప్రజలకు న్యాయం కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టబోతున్న భారత్ న్యాయ యాత్రకు సంబంధించి ఏర్పాట్లు ముమ్మరమవుతున్నాయి. ఈ విషయంపై వివరంగా చెప్పండి**

**– శ్రీకృష్ణ రామ్, హైదరాబాద్**

అవును శ్రీకృష్ణగారూ...ఇప్పటికే 14 రాష్ట్రాల మీదుగా 67 రోజుల పాటు యాత్ర చేయాలని నిర్ణయించగా.. దీనికి సంబంధించి ఎగ్జాక్ట్ రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేస్తోంది. దీనికి సంబంధించి ముఖ్యనేతల భేటీకి పిలుపునిచ్చింది. ఈ భేటీలో రూట్‌మ్యాప్‌తో పాటు లోగో, పాటకు సంబంధించి కూడా నిర్ణయం తీసుకోనున్నారు. జనవరి 8న రూట్‌మ్యాప్, జనవరి 12న యాత్రకు సంబంధించిన ప్రత్యేక పాటను విడుదల చేస్తామని చెబుతున్నారు కాంగ్రెస్ నేతలు. ఇప్పటికే రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టారు. ఈ యాత్ర తీసుకొచ్చిన పాజిటివ్ వైబ్స్ ఇంకా కాంగ్రెస్ క్యాడర్‌లో కంటిన్యూ అవుతూనే ఉన్నాయి. అయితే ఈ సారి దేశంలోని తూర్పు ప్రాంతం నుంచి పశ్చిమ ప్రాంతం వరకు భారత్ న్యాయ యాత్ర చేపట్టనున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు చేపడుతున్న ఈ యాత్ర ప్రభావం ఖాయంగా కనిపిస్తుంది. 2024, జనవరి 14 నుంచి మార్చి 20 వరకు ఈ యాత్ర నిర్వహించనున్నట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఇదివరకే తెలిపిన సంగతి తెలిసిందే. అయితే గతంలో మాదిరిగా పూర్తిగా పాదయాత్ర కాకుండా..ఈ సారి మధ్యమధ్యలో బస్సు యాత్ర కూడా ఉ ఒడనుంది.

**ప్రపంచమంతా న్యూ ఇయర్ వేడుకలకు సిద్ధమైంది. ఈ ఏడాది చివరి రోజును గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసేందుకు పబ్బులు, బార్లు, ఈవెంట్లు.. గెట్ రెడీ అంటున్నాయి. ఈ క్రమంలో పోలీసులు కూడా సిద్ధమైనట్టుకనిపిస్తూంది. మీరేమంటారు.**

**– విజయకుమార్.కె. కాకినాడ**

అవును కొత్త సంవత్సరానికి అంతా సిద్ధమైంది విజయ్‌గారూ... అయితే సెలబ్రేషన్స్ పేరిట చట్టాన్ని ఉల్లంఘిస్తే లైఫ్ రిస్క్‌లో పడటం పక్కా అని పోలీసులు హెచ్చరిస్తున్నారు. న్యూ ఇయర్ నిబంధనలు అతిక్రమించినా, చట్టాన్ని ఉల్లంఘించినా కటకటాల పాలవ్వక తప్పదని పోలీసులు స్ట్రాంగ్ వార్నింగ్ ఇస్తున్నారు. ముఖ్యంగా పోలీసుల నిఘా మొత్తం తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, వైజాగ్, విజయవాడ నగరాల్లో జరిగే వేడుకలపైనే ఉంది. ఇక న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ లో ఏం చేయాలో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. చిందులు, విందులు.. జిగేల్ మనే లైట్లు, డీజే మోతలు, బాణా సంచా కాలుస్తూ ఓ రేంజ్ లో సందడి చేస్తారు యువత. సెలబ్రేషన్స్ ఓకే.. కానీ కండీషన్లు అప్లై అంటున్నారు పోలీసులు.

న్యూయర్ వేడుకలకు ఎప్పుడూ లేని విధంగా పోలీసు యంత్రాంగం ప్రత్యే నిఘా పెట్టింది. సామాన్య ప్రజలకు ఇబ్బంది కలిగించే రైడ్స్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రి 8 గంటల నుంచి విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తారు. ఇక డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఇక డ్రగ్స్ తీసుకునే వారిపై నిఘా పెట్టేందుకు స్పెషల్ టీమ్స్ ఏర్పాటు చేశారు.

ఇక న్యూయర్ వేడుకలపై విశాఖ సీపీ క్రాంతి రానా టాటా అప్రమత్తమయ్యారు. తెలుగు తల్లి ఫ్లై ఓవర్‌పై వాహనాల నిషేధం అమలులో ఉంటుందన్నారు. ఆర్కే బీచ్ రోడ్డులో వాహనాలకు నో ఎంట్రీ. అర్ధరాత్రి ఒంటిగంటలోపే న్యూ ఇయర్ వేడుకలు ముగించాలని తెలిపారు. సంబరాలు పేరిట చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైజాగ్ సిటీలో సెక్షన్ 30 అమలులో ఉందన్నారు.

హైదరాబాద్ పరిధిలో ఫ్లైఓవర్లు, ఔటర్ రింగ్ రోడ్లపై ఇవాళ రాత్రి 10 నుంచి రేపు ఉదయం 6 గంటల వరకు వాహనాల ప్రవేశాన్ని నిషేధించారు. పాసులు ఉన్న వాహనాలకే శంషాబాద్ విమానాశ్రయం వెళ్లేందుకు ఔటర్ రింగ్ రోడ్డుపై అనుమతిస్తారు. పబ్, క్లబ్బుల్లో మద్యం సేవించి వాహనాలు నడిపే కస్టమర్లకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు.

# ఆధునిక భారతదేశానికి రూపశిల్పి మీనన్

**లెజెండ్**



ఆయన పేరు మీద ఒక్క జీవిత చరిత్ర లేదు. పాఠశాలల సిలబస్‌లో ఆయన రచనల ప్రస్తావన లేదు. చివరి ముగ్గురు వైస్రాయ్‌లకు వారి రాజ్యాంగ సలహాదారుగా సేవలందించిన ప్రతిభా శాలి, సమర్థ అధికారి ఆయన. స్వతంత్ర భారత దేశంలో, అధికార బదిలీల కీలక పాత్ర ధారిగా, కొత్తగా ఏర్పడిన రాష్ట్రాల శాఖ కార్యదర్శిగా, తరువాత ఒడిశా గవర్నర్‌గా పని చేశాడు. దేశం లోని ఒక చిన్న గ్రామంలో జన్మించిన ఆయన అసమాన ప్రతిభతో అత్యున్నత స్థాయి భారతీయ అధికారిగా ఎదిగాడు. ఆయనే ఆధునిక భారతదేశానికి రూపశిల్పి వి. పి. మీనన్. వప్పల పంగుణ్ణి మీనన్ (1893 సెప్టెంబరు 30 – 1965 డిసెంబరు 31) భారతీయ సివిల్ సర్వీసెస్ అధికారి. ఆయన భారత దేశపు చిట్ట చివరి లిన్లిత్‌గో, వేవెల్, మౌంట్ బాటన్ అనే చివరి ముగ్గురు వైస్రాయ్‌లకు రాజ్యాంగ సలహాదారు అయ్యాడు. రాజ్యాంగ సలహాదారుగా, రాజకీయ సంస్కర ణల కమిషనర్ గానూ పని చేశాడు. బ్రిటీష్ ప్రభుత్వం నుంచి బ్రిటీష్ ఇండియాకు స్వతంత్రం రావడంలో అత్యంత కీలకమైన అధికార బదిలీలోని భారత విభజన, భారత స్వాతంత్ర్య చట్టం, భారతదేశ ఏకీకరణ, భారత రాజ్యాంగ రచన వంటి అంశాల్లో బ్రిటీష్ ప్రభు త్వానికి, కొత్తగా ఏర్పడిన భారత ప్రభుత్వానికి సహకరిస్తూ కీలక బాధ్యతలు నిర్వర్తించాడు.

బ్రిటీష్, భారతీయ అధికారులచే విశ్వసించ బడిన మీనన్ ఒక సామాన్య కుటుంబం నుండి వచ్చాడు. ఒట్టప్పలంలోని పనమన్న వద్ద 1893 సెప్టెంబరు 30న జన్మించాడు. 13 సంవత్స రాల వయస్సులో, నిర్మాణ కార్మికుడిగా, బొగ్గు గని కార్మికు డిగా, ఫ్యాక్టరీలో వరుసగా పని చేయడానికి పాఠశాలను విడిచి పెట్టాడు. 8వ తరగతి వరకు మాత్రమే చదివిన మీనన్, రెండు వేళ్లతో టైప్ చేయడం నేర్చిన తరువాత, 1929లో సిమ్లాలో భారత పరిపాలనలో హోం శాఖలో గుమాస్తాగా ఉద్యోగంలో చేరాడు. 1947 నాటికి, మీనన్ వైస్రాయ్ సిబ్బందిలో అత్యంత సీనియర్ పోస్టుకు ఎదిగాడు, మౌంట్ బాటన్ విశ్వాసాన్ని, ప్రేమను పొందాడు.

స్వాతంత్ర్యానికి ముందు భారత గవర్నర్ జనరల్‌కు రాజ్యాంగ సలహాదారుగా మారారు. అంతకు ముందు, బ్రిటిష్ వలస రాజ్యాల సంస్కరణ కార్యాలయంలో అనేక ముఖ్యమైన పదవులను నిర్వహించాడు. 1942–47 మధ్య సంస్కర ణల కమిషనర్‌గా పనిచేశాడు. 1946లో బ్రిటిష్ వైస్రాయ్‌కు రాజ కీయ సంస్కరణల కమిషనర్‌గా నియమితు డయ్యాడు. 1947–51 సంవత్స రాలలో రాష్ట్ర మంత్రిత్వ శాఖలో కార్యదర్శిగా నియమించ బడ్డాడు. మౌంట్ బాటన్ ప్రణాళి కకు ప్రత్యామ్నాయంగా దేశ విభజ నకు సంబంధించి ఆయన రూపొం దించిన ముసాయిదా, ముఖ్యంగా ముగ్గురు ప్రముఖులు...నెహ్రూ, పటేల్, మౌంట్ బాటన్ల ఏకకాల ఆమోదం పొందింది. భారత బ్రిటిష్ ప్రభుత్వానికి రాజ్యాంగ సలహా దారుగా, స్వాతంత్ర్యం అనంతరం, అధికార మార్పిడి, రాష్ట్రం యొక్క రాజ్యాంగ విషయాలు, ప్రధానంగా సార్వ భౌమాధికారం, పాలన, ఫెడరల్ యూనియన్, యూనిట్ల మధ్య అధికార పంపిణీకి సంబంధించిన విధానాలపై మీనన్ చేసిన కృషి అనన్య సామాన్యం.

భారత దేశానికి స్వాతంత్ర్యానికి దారితీసిన ప్రసిద్ధ ప్రణాళికను సిద్ధం చేసింది మీనన్. తన పుస్తకం 'ట్రాన్స్‌ఫర్ ఆఫ్ పవర్ ఇన్ ఇండియా'లో, ప్రత్యామ్నాయ ముసాయిదా ప్రణాళికను సిద్ధం చేయడానికి తనకు రెండు లేదా మూడు గంటలు మాత్రమే సమయం ఎలా పట్టిందో గ్రంథస్థం చేశాడు. ఆయన ప్రణాళికను పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, మహమ్మద్ అలీ జిన్నా అంగీక రించారు.

మీనన్ సర్దార్ పటేల్‌తో కలిసి 500 కంటే ఎక్కువ రాచరిక రాష్ట్రాలను యూనియన్ ఆఫ్ ఇండియాలో విలీనం చేయడంపై పనిచేశాడు. ఈ విషయంలో వాస్తవంగా పటేల్ కన్నా మీనన్ చేసిన కృషియే ఎక్కువ. మంత్రిత్వ శాఖ మరియు వివిధ భారతీయ రాచరిక పాలనల మధ్య మంచి సంబంధాన్ని పెంపొందించ డానికి దౌత్యాన్ని ఉపయోగించాడు. పటేల్ రాయబారిగా వ్యవహరించాడు. భావి భారత స్వతంత్ర దేశానికి ఫ్రేమ్ వర్క్‌ను రూపొందించడానికి అయిష్టంగా ఉన్న రాజులు, పాలకులతో ఒప్పందాలు కుదుర్చు కున్నాడు. మీనన్ తన రచనలైన రెండు సంపుటాలలో స్వతంత్ర్య భారతదేశం, పాకిస్తాన్ రెండు సార్వభౌ మ రాజ్యాల ఆవిర్భావానికి దారితీసిన సంఘటనల చారిత్రక నేపథ్యం వివరించారు. 500 పైగా రాచరిక రాష్ట్రాలను స్వతంత్ర భారత దేశంలో విలీనం చేయ డంలో ఉక్కు మనిషి సర్దార్ పటేల్ కు సహాయం చేసిన ఘనత వహించిన మీనన్ కు దక్కాల్సిన గుర్తింపు దక్కలేదు. ఆయన పేరు మీద ఒక్క జీవిత చరిత్ర లేదు. పాఠశాల సిలబస్‌లో ఆయన రచనల ప్రస్తావన లేదు. ఆయన స్థాపించిన విపి మీనన్ అవార్డు మాత్రమే గుర్తుగా ఉంది. బ్రిటీష్ మరియు స్వతంత్ర భారత దేశ సమర్థ అధికారి, డిసెంబర్ 31, 1965న 72 సంవత్సరాల వయస్సులో బెంగళూరులోని కంటోన్మెంట్‌లోని కుక్ టౌన్‌లో మరణించాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల...**
**9449595494**

## నవ కవిత్వం


### నూతన సంవత్సరానికి స్వాగతం




పాత సంవత్సరానికి వీడ్కోలు
కొత్త సంవత్సరానికి స్వాగతం
సుస్వాగతం
గత సంవత్సరపు చేదు జ్ఞాపకాలు
ఆత్మీయులను, స్నేహితులను కాలం
కాటేసిన యాది మరుపు రాని మది
నూతన సంవత్సరం లో కొత్త కొత్త
ఆశలు
భవిష్యత్తులో అన్ని అనుకూలంగా
జరగాలనే పూజలు
కుల, మత, ప్రాంత, వర్గ, వర్ణ,
భాష, ప్రాంత, స్త్రీ, పురుష, చిన్న,
పెద్ద వ్యత్యాసం మరిచి నూతన
సంవత్సర శుభాకాంక్షలతో తడిసి
ముద్దయింది
అన్ని దేవాలయాలు, పుణ్య క్షేత్రాలు
భక్తులతో కిటకిట
ఆకాశానికి అందే ధరలతో కటకట
కరోనా, డెంగ్యూ, మలేరియా,
టైఫాయిడ్ లతో అతలాకుతలం
గత సంవత్సరమంతా
అయోమయం
2023 కి ముగింపు పలుకుదాం
2024 నిండైన హృదయంలో
ఆహ్వానిద్దాం
ఆరోగ్య తెలంగాణను నిర్మిద్దాం
నూతన సంవత్సరంలో అన్ని
పనులన్ని సకాలంలో, సక్రమంగా
సంక్షేమ పథకాలను సద్వినియోగం
చేద్దాం
నూతన, వినూత్న ఆలోచనలకు
స్వీకారం
గత సంవత్సరానికి నమస్కారం
నూతన సంవత్సరమంటే
మమకారం
ఆంగ్లేయ నూతన సంవత్సర మైన
ప్రపంచ మంతా పండుగ దినం
విశ్వమంతా తిరునాళ్ళు, వేడుకలు,
ఉత్సవాల జాతర

**డాక్టర్. ఎస్. విజయ భాస్కర్., 9290826988**

## లేఖలు




**ముఖచిత్ర కథనం బాగుంది**

ఉత్తర ద్వార దర్శనం కోసం జరిగే తతంగం గురించి విపులంగా వివరించిన తిరు చాలా నచ్చింది. రచయితకు ధ న్య వా దా లు. వి వి ధ సందర్భాలను ప్రత్యక్షంగా కళ్లకు కట్టినట్టు చూపించిన రచయితకు , ప్రచురించిన ఎడిటర్, యాజమాన్యాలకు ధన్యవాదాలు. సందర్భాను సారంగా మన పత్రికలో ప్రత్యేక వ్యాసా లు రాయించి ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి కృతజ్ఒతలు. తెలుగు భాషపైనా ఓ ప్రత్యేక కాలమ్ నిర్వహిస్తే బాగుం టుంది. భాషను మర చిపోయి బావ దారిద్రంలో ఉన్న వారికి ఉ పయోగ పడుతుందని నా మనవి.

**–బి మధుశేఖర్, హైదరాబాద్**

**ఘుమఘుమలు అదురుతున్నాయి**

వారం వారం భాగ్యలక్ష్మి వివిధ రకాలైన వెరైటీ వంటలు రాస్తూ, ఆరో పేజీని ఘుమఘుమలాడి స్తు న్నారు. ఆరోగ్యం, ఆనందం సమ్మి ళితంగా ఆమె చేస్తున్న ప్రయోగా లకు ధన్యవాదా లు. ఆమె నుంచి మరిన్ని కొత్త వంటల రుచులను కోరుకుంటు న్నాం. స్వీట్లు, స్నేక్స్ తయారీలోనూ కొత్త కొత్త రుచులను పరిచయం చేయాలను ఆశిస్తున్నాం.

**– వారాంతపు రజనీ, వరంగల్**

**సినిమా రివ్యూలు బాగున్నాయ్**

వారం వారం విడుదలవుతున్న చిత్రాలలో మంచి చెడ్డలను, నటీ నటులు, సాంకేతిక నిపుఫణుల పనితీరును అర్ధవంతంగా వివరి స్తున్న విశ్లేషకు లకు ధన్యావాదా లు. ప్రధానంగా ధియేటర్లలోకి రాకుండా ఓటిటికే పరిమితమవు తున్న సినిమా లపైనా విశ్లేషణలే చేస్తుండటం హర్షించదగ్గది.


**– ముక్కామలపద్మావతి, హైదరాబాద్**
**–శ్రీవల్లి తన్మయ్, హైదరాబాద్,**

**కథలు బాగున్నాయి**

వారం వారం ప్రచురిస్తున్న కథలు బాగున్నాయి కొత్త రచయితలకు మీరందిస్తున్న ప్రోత్సాహం బాగుంది. అలాగే రంకు ధారావాహిక మెచ్చు కోలు గా ఉంది. రచిత కథనా న్ని బాగా నడిపిస్తున్నారు. మంచి రచనలు అందిస్తున్న మీకు ధన్యవా దాలు

**– జి. సర్వేశ్వరరావు, తెనాలి**

# 2024




రెండు వేల ఇరవై నాలుగు
పన్నెండు నెలల ప్రయాణ పరుగు
అందరిలో ఎన్నెన్నో ఆశలు కలుగు

మంచి పనులకు పెట్టాలి మెరుగు
సేంద్రియ ఆహారంతో తులతూగు
మనిషిగా మానవత్వంతో మెలగు


ప్లాస్టిక్ భూతాన్ని చేసేద్దాం
కనుమరుగుజి
ఈ విశ్వం మేల్కోపోతే భూతల్లినే
ప్లాస్టిక్ ప్రళయం మింగు
చేపట్టు జనప, క్లాత్, పేపర్ బ్యాగు


కాలుష్యపు మురికిని కడుగు
హరితహారనికి వేయాలి అడుగు
భూతల్లి రక్షణకు పట్టాలి గొడుగు

సకల క్షేమంకై ముందుకు జరుగు
కొత్త ఏడాదంతా ఇవ్వాలి వెలుగు
లోకమంతా అవ్వాలి సొబగు!!!

**( కొత్త సంవత్సరం 2024 సందర్భంగా )**


**బోనగిరి. పాండురంగ ... 8341212132**






# సూర్య బుడత



బాలల కథ

## పిల్లి రక్కింది..!



అదొక ప్రభుత్వపాఠశాల. ప్రార్థన తరువాత విద్యార్థులంతా తమ, తమ తరగతి గదుల్లోకి వరుసగా వెళ్లి కూర్చున్నారు.

మూడవ తరగతిలోకి రామచంద్రయ్య మాష్టారు రాగానే విద్యార్థులంతా లేచి నిలబడి సవినయంగా రెండు చేతులు జోడించి నమస్కరించారు. మాష్టారు పిల్లలను ఆశీర్వదిస్తూ.. కూర్చోండి అన్నట్టు చేత్తో సూచించాడు.

తెలుగు బోధించే రామచంద్రయ్య మాష్టారు అంటే పిల్లలందరికీ చాలా ఇష్టం. మాష్టారు పాఠాలతోబాటు పిల్లలకు లోకజ్ఞానం కోసం.. ఆ పాఠానికి సంబంధించిన ఏదైనా ఒక సంఘటను కళ్ళకు కట్టినట్టు కథల రూపంలో చెబుతుంటాడు. దాంతో ఆనాటి పాఠం పిల్లల మనసుకు హత్తుకు పోతుంది.

మాష్టారు విద్యార్థుల హాజరు తీసుకుంటూ చైతన్య అనే విద్యార్థి ఇంకా రాలేదని గుర్తించాడు. ఎవరికైనా సెలవు పత్రము ఇచ్చాడా అని ఆరా తీశాడు. పిల్లలంతా తల అడ్డంగా ఊపడం చూసి ఆశ్చర్యపోయాడు. అత్యవసర పని ఉన్నా, అనారోగ్యము అయినా సెలవు పత్రము ఇవ్వాలనే మాష్టారు ఆదేశాన్ని పిల్లలంతా తప్పకుండా పాటిస్తారు. కాస్త ఆలస్యంగా వస్తాడేమో! అని మనసులో అనుకుంటూ తెలుగు పుస్తకం తెరిచాడు.

"పిల్లలూ.. ఈ రోజు మనం 'కుక్క విశ్వాసం.. పిల్లి బేమాని' అనే పాఠం చెప్పుకుందాం" అనగానే తరగతి గది నిశ్శబ్దంగా మారిపోయింది. ఇంతలో "మాష్టారూ .. రావచ్చా.." అంటూ గది ప్రవేశ ద్వారం వద్ద నిలబడ్డ చైతన్యను చూసి పిల్లలంతా కనుగుడ్లు తేలేసి నోర్లు తెరిచారు. చైతన్య ముఖం మీద, కాళ్ళకు చేతులకు అక్కడక్కడ ఎవరో రక్కినట్టుగా గాయాలు ఉన్నాయి. వాటిపై పసుపు అద్దిన మరకగుర్తులు కనబడుతున్నాయి. మాష్టారు పుస్తకం మేజాబల్లపై పెట్టిచటుక్కున వెళ్లి చైతన్యను హత్తుకున్నాడు. ఏమయ్యిందని నెమ్మదిగా అడిగాడు. చైతన్య బిక్కమొగము పెట్టి "పిల్లి రక్కిందిమాష్టారూ.." అంటూ కన్నీళ్లు పెట్టుకున్నాడు. పిల్లలంతా ఒక్క సారిగా పడీ, పడీ నవ్వారు. మాష్టారు తీక్షణంగా పిల్లల వంక చూసే సరికి ముఖాలు దించుకున్నారు. చైతన్య ప్రక్కనే కూర్చొనే విద్యార్థి ధైర్యంగా లేచి నిలబడి.. "మాష్టారూ .. ఎక్కడైనా పిల్లి రక్కుతుందా!.. మనల్ని చూడగానే పారి పోతుంది కదా!. చైతన్య చెప్పేది అబద్ధం. ఎవరితోనో గొడవ పడితే.. వాడు రక్కి ఉంటాడు" అంటూ మళ్ళీ నవ్వబోయే సరికి మాష్టారు కన్నెర్ర చేసి కూర్చోమన్నాడు.

"పిల్లి ఎందుకు రక్కదు? రక్కుతుంది" అంటూ తరగతి అంతా కలియ చూసాడు. మాష్టారు కథ చెబుతాడని పిల్లలంతా మౌనంగా చూడసాగారు.

"చైతన్యను పిల్లి ఎందుకు రక్కిందో నేను ఊహించగలను. చైతన్యా నువ్వు వెళ్లి కూర్చో.. నేను చెప్పింది విన్నాక నిజమో! కాదో! చెప్పు " అంటూ గొంతు సవరించుకున్నాడు.

"పిల్లి పాలు తాగుతూ నన్నెవరూ గమనించడంలేదని అనుకుంటుందట. ఎందుకు అలా అనుకుంటుంది? అది దొంగతనంగా తాగుతుంది కాబట్టి. అదే మనం ఒక పాత్రలో పాలుపోసి పిల్లి ముందర పెడితే నిర్భయంగా తాగుతుంది. దానధర్మాలు చేయని వారిని 'పిల్లికి కూడా బిచ్చం పెట్టనివారని' సామెత ఉంది. పిల్లి పెంపుడు జంతువు. ఒకవేళ మనం ఇంట్లో పిల్లిని పెంచుకోకపోయినా అది కనబడితే పాలు, ఆహారం ఇవ్వడం మన ధర్మం. దానికి ఏమీ దొరక్క, ఆకలికి తట్టుకోలేకనే దొంగతనానికి పాలుబడుతుంది. మానవులు దానికంటే అధములు. అన్నీ ఉన్నా ఆర్భాటాల కోసం దొంగతనాలు చెయ్యడం మనం వార్తల్లో చదువుతూనే ఉన్నాం.


ఒకసారి ఒక ఇంట్లో పిల్లి తాగిందంటే అదే అలవాటుతో మరునాడు గూడా వస్తుంది. ఒకసారి దొంగతనంగా పాలు తాగాను కదా.. తప్పు చేసాను. మరో మారు తాగగూడదని అనుకోదు. పోనీ..! పాలు పోసామని విశ్వాసం కూడా చూపదు. అందుకే 'పిల్లి బేమాని' అనే సామెత పుట్టింది. అయితే మన జాగ్రత్తలో మనం ఉండాలి తప్ప పిల్లిని కొట్టడం తప్పు. బహుశః తనకు పోసిన పాలు పిల్లి దొంగతనంగా తాగుతోందని చైతన్య తలుపులన్నీ మూసి దాన్ని కొట్టడానికి ప్రయత్నించి ఉంటాడు. తమ ప్రాణం మీదకు వచ్చినప్పుడు ఎంత బలహీనులైనా తమ రక్షణ కోసం శక్తి మేరకు ఎదురించి పోరాడతారు. అది ప్రకృతిసహజం.. అలాగే ఎటూ పారి పోయే వీలు లేక తనపైన దాడి చేసే వారి మీద పిల్లి పులిలా ఎదురిస్తుంది.. రక్కుతుంది.. భయంకరంగా అరుస్తుంది. అదే జరిగి ఉంటుంది.. అవునా చైతన్యా.." అంటూ చైతన్య వంక చూసాడు మాష్టారు. చైతన్య బిక్కు, బిక్కుమంటూ లేచి నిలబడి అవునన్నట్టుగా తల ఊపుతూ దించుకున్నాడు.


**–చెన్నూరి సుదర్శన్. 94405 58748**







# దేవుడి భార్య



## సరికొత్త సీరియల్

(గతవారం తరువాయి)

మస్తాన్ తప్పతాగి బీవిని కొట్టినప్పుడో, బీవి ఇద్దరి ఆడపిల్లలకు నిఖా చేసినప్పుడో హజరత్ బీవీ ఇంటివైపు తొంగిచూడలేదు. ఇప్పుడు మాత్రం బీవికి న్యాయం చేయాలన్నట్లు మాట్లాడాడు.

వాస్తవానికి బీవికి న్యాయం చేయడానికి కాదు. తన వంతు వాటా తనకు దక్కుతుందో, లేదోనన్న అనుమానంతో, భయంతో ఈసరయ్యను, పూజారిని హెచ్చరించాడు.

'అలా అంటే ఎలా హజరత్ సాబ్? ఊరికి కులం ఏంది చెప్పు? పీర్ల పండగలో మేమంతా పాల్గొనడం లేదా? ఊరి కోసం ఆ మాత్రం చేయకపోతే ఎలా? బీవి అన్యాయం చేయకుండా చూద్దాం.' ఎలాంటి న్యాయం చేస్తాడో చెప్పలేదు. పని అయిన వెంటనే మీ ఇంటికి స్వయంగా నేనే వస్తాను. అది బీవికి హామీ కాదు, హజరత్ కు హామీ. ఊరేగింపులోని ప్రజలంతా పూజారిని సమర్థించారు. బీవి ఎనుములను బలి ఇవ్వడానికి అందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు.

అయ్యా.. అయ్యా.. అయ్యా.. నేనేం అన్యాయం చేశాను. ఈ ఎనుములు నా బిడ్డల కంటే ఎక్కువ. ఈ ఎనుములే నా బిడ్డల పెళ్ళిళ్ళు చేశాయి. ఈ ఎనుములే నా కడుపు నింపుతున్నాయి. ఈ ఎనుములే నా కుటుంబాన్ని పోషిస్తున్నాయి. చేసుకున్నోడు తన బాధ్యతను మరిచి తాగి తైతక్కలు ఆడుతున్నాడు. ఎనుములను బలి ఇస్తే నేనెలా బతికేది? నా బిడ్డను ఎలా సాక్కునేది? ఆ ఎనుములతో పాటు నన్ను, నా బిడ్డను కూడా అదే పొలిమేర దగ్గర బలి ఇవ్వండని నెత్తి-నోరు బాదుకుంది, పూజారి, ఈసరయ్య కాళ్లవేళ్ల పడింది.

నీకు అన్యాయం జరగదు. అమ్మవారికి అంతా తెలుసు. అన్నీ తానే చూసుకుంటుంది. ఊరంతా నీకు సహాయంగా ఉంటుందని పూజారి పూనకం వచ్చిన వాడిలా ఊగాడు.

బీవికి ఉన్న ఎనుములను తీసుకెళ్లారు. పొలిమేరల్లో రక్తాన్ని పారించారు. ఆ రక్తం బీవి కంట్లో నుండి, శరీరం నుండి, గర్భం నుండి చిమ్మింది. నెత్తినోరు బాదుకుంది, దుమ్ములో పొర్లింది, మట్టిని నెత్తిపై పోసుకుంది. అందరూ చోద్యం చూశారు. తప్పని, మూఢనమ్మకమని, బీవి పొట్టను కొట్టవద్దని, కుటుంబాన్ని వీధిలోకి లాగవద్దని చెప్పలేకపోయారు.

భయపడ్డారు, మనకెందుకులే అనుకున్నారు, వాళ్ల సమస్య కాదనుకున్నారు, అమ్మవారు ఆగ్రహిస్తుందని, బలి తీసుకుంటుందని అనేక కారణాలతో అందరి నోర్లు మూసుకుపోయాయి. 'ఎప్పుడు తెరుచుకుంటాయో!? నోర్లు మాత్రమేనా!? మెదళ్లు కూడా'

జాతర అయిపోయింది. ఊరంతా ప్రశాంతంగా ఉంది. అమ్మవారు నిన్ను, నీ కుటుంబాన్ని కాపాడుతుందన్న పూజారి దగ్గరకు వెళ్ళింది బీవి.

'ఏం బీవి? ఇలా వచ్చావు? ప్రసాదం ఉంది తీసుకుపో, ఇంట్లో బోకులు కడుగు అమ్మయ్య అన్నం పెడుతుంది, కసువు ఊడ్చు అమ్మయ్య పాత చీర ఇస్తుంది, ఇంట్లో పనులు చూసుకో! నీ ఇల్లు గడుస్తుంది. కొన్ని రోజులుంటే అమ్మవారు దారి చూపుతుంది.'

బీవికి వేరే గతి లేదు. ఇంట్లో పిల్లదానికి అన్నం పెట్టాలి. మొగుడు పనికిమాలినవాడు. పూజారి చెప్పింది చేసింది, చేస్తూనే ఉంది, చేయడం అలవాటు చేసుకుంది.

ఈసరయ్య దగ్గరకు వెళ్ళింది. చేతులు జోడించి అర్థించింది. వెక్కి వెక్కి ఏడ్చింది.

"అమ్మ గారు పురుడు కోసం పుట్టింటికి వెళ్ళింది. ఇంట్లో ఎక్కడ పనులు అక్కడున్నాయి. పనులు పూర్తి చేస్తే చిల్లర ఇస్తాను. వంట చేసి పెట్టి.. మిగిలింది ఇంటికి తీసుకెళ్లు, పడక గదిలో పక్క ఖాళీగా ఉంది.. కాసేపు పడుకో, కాసేపు ఓర్చుకో, కాసేపు కళ్ళు మూసుకో! కాసేపు.. కాసేపు.. కాసేపు"

"పూజారి ఇంట్లో ఇంటి పని చేయడం, ఈసరయ్య ఇంట్లో పడక పని చేయడం అలవాటు చేశారు. ఒకరు శ్రమను దోపిడీ చేస్తే మరొకరు మనసును, మానాన్ని దోపిడీ చేశారు."

విషయం తెలుసుకున్న మస్తాన్.. ఈసరయ్య మీద ఎగిరాడు, తిట్టాడు, ఉమ్మాడు. ఆ మరుసటి రోజు లారి కిందపడి చనిపోయాడు. చంపింది లారి కాదు.. లారి లాంటి ఈసరయ్య.

పూజారి ఇంట్లో పని వద్దన్నాడు. బీవిని పక్క వీధిలో ఖాళీగా ఉన్న తన గుడిసెలో ఉండమన్నాడు. భార్య ఉన్నప్పుడు ఇంట్లో పని, లేనప్పుడు పడకగదిలో పని చేస్తే చాలన్నాడు.

బీవి అంగీకరించలేదు. వేరే మార్గం లేదు, వేరే మార్గాన్ని వెతుక్కున్న ఈసరయ్య వదలడు. ఏమీ చేయలేకపోయింది, మాట్లాడలేకపోయింది, గట్టిగా అరిచి ఊరంతా చెప్పలేకపోయింది. చెప్పినా ప్రయోజనం ఉండదని నమ్మింది.

పురుడు కోసం వెళ్ళిన ఈసరయ్య భార్య పురిట్లోనే బిడ్డను కోల్పోయింది. బిడ్డ పోయిన బాధను తట్టుకోలేకపోయింది. అదే దిగులు, అదే ఏడుపు. లేక లేక గర్భవతి అయ్యింది. ఈసారి బిడ్డ పోతే మళ్ళీ పుట్టరని డాక్టర్ చెప్పినాడు.

బిడ్డ పోయిందనే బాధ కంటే ఇక పిల్లలు పుట్టరనే బాధ, గొడ్రాలు అనే బిరుదు మోయాలనే బాధ ఎక్కువైంది. మనసు మనసులో ఉండటం లేదు. అడుగు అడుగులో వేయడం లేదు. చూపులు తేలిపోయాయి. మతిమరుపు ఏది గుర్తు రావడం లేదు. పిచ్చి పట్టినదానిలా అయ్యిపోయింది. వాయి వచ్చింది. పిచ్చి పిచ్చిగా మాట్లాడింది. ఆ మాటలే, ఆ పిచ్చే కొనసాగింది.

ఈసరయ్య భార్య దగ్గరి కంటే బీవి దగ్గరే ఎక్కువగా ఉంటున్నాడు. బీవిని ప్రేమించాడు, మోహించాడు, బీవినే సర్వస్వం అనుకున్నాడు. మెహతాజ్ ని బిడ్డలా చూసుకున్నాడు. బీవిని ఈసరయ్య ఉంచుకోలేదు, అలాగని పెళ్లి చేసుకోలేదు. అయినా ఊరు ఊరంతా వారిద్దరినీ భార్యాభర్తలుగానే గుర్తించింది. దానికి కారణం మస్తాన్ చనిపోయాక, ఈసరయ్య చెంతకు చేరిన తర్వాత బీవి ఈసరయ్య దగ్గరే పడుకుంది, ఎంతోమంది తమ దగ్గర పడుకోమని అడిగినా, రకరకాలుగా ఆశలు చూపినా లొంగలేదు. ఈసరయ్యను మొదట కసిరింది, భర్తను చంపినవాడిని చంపాలనుకుంది. ఆ తర్వాత ఈసరయ్య ప్రేమకు లొంగింది. ఈసరయ్యే తనకు భర్తని భావించింది.

బిడ్డలు పుట్టలేదని, భార్య ఒంటరిగా ఉంటోందని చెల్లెలి బిడ్డ గంగను ఇంటికి తెచ్చుకున్నాడు. గంగకు పదహైదు ఏళ్లు ఉంటాయి. ఐదు దాక చదివి, చదువు అబ్బకపోవడంతో బడి మానేసింది. అత్తకు, మామకు సపర్యలు చేస్తోంది.

ఇంట్లో వంట చేయడం, గుత్తకు ఇచ్చిన పొలం లావాదేవీలు చూడటం, అత్తకు అన్నం తినిపించడం, మామకు కాళ్లు పట్టడం, బయటకు వెళ్లి అలిసొస్తే కాళ్లు కడుక్కోవడానికి నీళ్లు అందివ్వడం, స్నానానికి నీళ్లు తోడటం, వీపు రుద్దటం, పడక గది శుభ్రం చేయడం. చూస్తూ చూస్తూనే ఇంట్లో అన్నీ తానై చూసుకోవడం మొదలు పెట్టింది.

***

శివాలయం గుడి పక్కనే ఈసరయ్య ఇల్లు. ఆ ఊర్లో అదొకటే పురాతనమైన శివాలయం. అయ్యప్ప స్వామి దీక్ష మొదలైతే పూజలు, భజనలు తెల్లవారుజాము వరకు జరుగుతూనే ఉంటాయి.

విశాలమైన గుడి కావడం, గుడి వెనుక పాత మండపం ఉండటం వల్ల సౌదయ్యను కలుసుకోడానికి గంగకు బాగా అబ్బేది. గుడి ముందుపక్క ఖాళీ ప్రదేశంలో అయ్యప్పస్వామి భజన జరుగుతుంటే వెనుక వైపు పాత మండపంలో గంగ, సౌదయ్య శారీరక వాంఛలు తీర్చుకునేవారు. అయ్యప్పస్వామి భజనలో గంగ మూలుగులు, అరుపులు కలిసిపోయేవి. గంగ, సౌదయ్య ప్రేమికులు కాదు. ఇద్దరి మధ్య ప్రేమ లాంటి వ్యవహారం ఏమీ లేదు. గంగను చూసి సౌదయ్య కన్నుకొట్టాడు, గంగ మొదట ముఖం తిప్పుకుంది. ఆ తర్వాత మెల్లగా సౌదయ్యను చూడటం మొదలు పెట్టింది. ఎందుకు వెళ్ళారో గానీ ఒకసారి గుడి వెనుక వైపు ఉన్న పాత మండపానికి వెళ్లారు. బహుశ! రహస్యంగా మనసు విప్పి మాట్లాడుకోడానికి కావచ్చు. మనసు విప్పి మాట్లాడుకోవడం జరగలేదు కానీ బట్టలు విప్పి మాట్లాడుకున్నారు.

అప్పటి నుండి సమయం దొరికినప్పుడల్లా మాట్లాడుకుంటూనే ఉన్నారు. సౌదయ్య మాత్రం గంగను ప్రేమిస్తున్నానని చెప్పలేదు. గంగ కూడా సౌదయ్య నుండి ప్రేమను కోరుకోలేదు.

సౌదయ్య శివాలయం గుడికి వెళ్ళేవాడు. మొదట శివుడి దర్శనం కోసమే వెళ్ళేవాడు. గుడిలో శివుడి సంగతి పక్కనపెడితే, గుడి దగ్గర గంగ దర్శనం జరిగింది. గంగ కోసం రోజూ గుడికి వెళ్ళేవాడు. మొదటిసారి కలిసినప్పుడు గంగ చేతిలో వంద రూపాయలు పెట్టాడు. గంగ సంబరపడిపోయింది. పది రూపాయలు కూడా కళ్లకు చూడని గంగ వంద రూపాయలు చూడగానే తన బాల్యంలో కోల్పోయినవన్నీ కొనాలనుకుంది.

తన శరీరాన్ని అమ్ముకుందని గ్రహించలేకపోయింది. తన మానానికి సౌదయ్య విలువ కట్టాడని, తనతో శారీరకంగా కలిసినందుకు డబ్బు ఇచ్చాడని అనుకోలేదు. ఆ సమయంలో తన అవసరాలు, కోరికలు, డబ్బు లేని కారణంగా కోల్పోయిన ఆనందాలే గుర్తు వచ్చాయి.

ప్రతిరోజు సౌదయ్య కోసం ఎదురుచూసేది. సౌదయ్యతో ఒక గంట గడిపితే చాలు వంద రూపాయలు ఇస్తాడు. గంగ వాళ్ల అమ్మ.. అమ్మయ్య ఇంట్లో నెల రోజులు బోకులు తోమినా వచ్చేది నలభై రూపాయలే. తల్లి సంపాదనకు, తన సంపాదనకు ఉన్న వ్యత్యాసం తెలుసుకోలేకపోయింది.

కొన్ని రోజుల తర్వాత వంద సరిపోదూ రెండు వందలు కావాలని మెలిక పెట్టింది. సౌదయ్య సరే అన్నాడు. గంగకు ఎక్కడలేని ఆనందంగా అనిపించింది. సౌదయ్య ఒక్కడితో కాకుండా సౌదయ్య లాంటి వాళ్లు ఇంకొందరు పరిచయమైతే ఇంకా డబ్బు సంపాదించవచ్చు. ఇంటికి కూడా పంపవచ్చు. అమ్మకు ఉండేది రెండు చీరలే. అమ్మ కోసం నాలుగు చీరలు కొనాలనుకుంది. ఎన్నో రోజుల నుండి పట్టుపంచె కొనాలనుకొని కొనలేకపోయిన తండ్రికి రెండు పట్టుపంచెలు కొనాలనుకుంది. తన కోసం పైట-పావడా తీసుకోవాలనుకుంది.

మొదట అవసరాల గురించి ఆలోచించింది. ఆ తర్వాత కోరికలు తీర్చుకోవాలనుకుంది. చెవులకు కమ్మలు, ముక్కుకు ముక్కు పుడక, పాదాలకు పట్టీలు, మెడలో గొలుసు ఇలా కోరికల చిట్టా పెరిగే కొద్దీ సౌదయ్య లాంటి వ్యక్తులు ఎక్కువయ్యారు.

అంగరంగ వైభవంగా, లక్షలు ఖర్చు పెట్టి పెళ్ళిళ్ళు చేసుకోలేనివారు శివాలయంలో పెళ్ళిళ్ళు చేసుకుంటారు. పులివెందుల ప్రజలే కాకుండా చుట్టుప్రక్కల పల్లెల నుండి కూడా పెళ్ళిళ్ళు చేసుకోడానికి వచ్చేవారు. సంవత్సరానికి ఒకసారి జాతర, నెలలో ఎన్నో పూజలు, హోమాలు, వ్రతాలు, నామకరణాలని గుడి ఎప్పుడూ సందడిగానే ఉంటుంది. గుడి ఎంత సందడిగా ఉంటే గంగ వ్యాపారం అంత బాగా జరుగుతుంది.

సౌదయ్య తన స్నేహితులకు కూడా గంగ గురించి చెప్పాడు. అలా తెలిసినవారితో, తెలియనివారితో ఒకరితో, ఒకేసారి ఇద్దరితో గడిపేది. గుడి ఎంత రద్దీగా ఉంటే గంగ అంతకంటే ఎక్కువ రద్దీగా ఉండేది.

గుడి వెనుక పాత మండపంలో, లైన్స్ క్లబ్బు వెనుక, గంగ ఇంటి పక్కన ఉన్న కళ్యాణ మండపంలోని బాత్ రూమ్ లో, శివాలయం పక్కన ఉండే లింగ బలిజోల్ల స్మశానంలో, రాణితోపు వంకలో, రంగనాయకుల గుడిలో, జెండమాను మస్జిద్ వెనుక ఉన్న పాడుబడిన గదిలో. ఎక్కడ ఖాళీ దొరికితే అక్కడ, ఎక్కడ శ్రేయస్కరం అనుకుంటే అక్కడ గంగ తన మానాన్ని వదిలింది.

కొన్ని రోజులపాటు గంగ వ్యాపారం రహస్యంగానే జరిగింది. ఆ తర్వాత రహస్యంగా ఉంచలేకపోయింది. బహిరంగంగానే వ్యాపారం మొదలు పెట్టింది. ఇంట్లో ఉన్న ఈసరయ్య భార్య మంచాన పడటంతో ఏమీ చెప్పలేకపోయింది. ఏమైనా చెపితే తనకు అన్నం పెట్టే దిక్కు ఉండదని భయపడింది.

ఊరంతా ఎందుకు తిరగాలి? బయటైతే ప్రాణానికి హాని ఉండవచ్చని భావించింది. మానానికి హాని లేదు, ఉన్నా ఫర్వాలేదు. ఇంటికే అందరిని రమ్మని చెప్పింది. ఒకరోజు సౌదయ్య ఇంట్లో ఉండగా బయటకు వెళ్ళిన ఈసరయ్య ఇంటికి తిరిగి వచ్చాడు. సౌదయ్య, గంగను నగ్నంగా చూశాడు. ఈసరయ్యను చూసి సౌదయ్య అక్కడి నుండి పారిపోయాడు.



రచన : జానీ తక్కెడశిల
7259511956

# తిరుమల లడ్డూకు ఎంత ప్రాముఖ్యత ఉందో



తిరుమల లడ్డూకు ఎంత ప్రాముఖ్యత ఉందో .. అందరికీ తెలిసిందే. దాని గురించి ప్రత్యేకంగా ఎవరూ చెప్పనక్కరలేదు. తిరుమల అనగానే మనకు లడ్డూ మాత్రమే గుర్తుకు వస్తుంది. టీటీడీలో రకరకాలైన ప్రసాదాలు అందుబాటులో ఉన్నప్పటికీ, భక్తులకు లడ్డూ ప్రసాదం అంటేనే ఎంతో ప్రీతిపాత్రంగా ఉంటుంది. ప్రసాదాలలో శ్రీవారి లడ్డూ అగ్రస్థానంలో నిలిచింది. ప్రసాదంగా లడ్డూను ఇవ్వడం 1715 ఆగస్టు 2 వ తేదీన ప్రారంభించారు. 2010 వరకూ దాదాపు రోజుకు లక్షల లడ్డూలను టీటీడీ తయారు చేసేది.. భక్తుల అధిక రద్దీ కారణంగా ప్రతి నిత్యం దాదాపు మూడు లక్షల ఇరవై వేల లడ్డూలను టీటీడీ తయారు చేస్తోంది.

తిరుమల వెంకన్న కోరిన కోర్కెలు తీర్చే దేవదేవుడని, తమ కష్టాలను తొలగించే దివ్య పురుషుడని భక్తుల విశ్వాసం. అందుకే నిత్యం లక్షల సంఖ్యలో భక్తులు తిరుమలకు వస్తుంటారు. ఇక్కడికి వచ్చిన భక్తులు స్వామి వారి దర్శన అనంతరం, స్వామి వారి ప్రసాదమైన లడ్డూనూ తమతో పాటూ ఇంటికి తీసుకెళ్తారు. ఈ లడ్డూను తమ ఇంటిలో భక్తి శ్రద్దలతో పూజించి ఆత్మీయులకు పంచి పెడుతుంటారు.

ఇంతకి శ్రీవారి లడ్డూ ప్రసాదం ఎప్పుడూ తయారు అయ్యింది. శ్రీవారి లడ్డూ ప్రసాదం మొదలు పెట్టి ఎన్నేళ్ళు అయ్యింది. తిరుమల శ్రీవారికి సమర్పించే నైవేద్యాలకి పెద్ద చరిత్రే ఉంది. సుప్రభాత సమయంలో స్వామి వారికి వెన్నతో మొదలు పెట్టి, లడ్డూ, వడ, పొంగలి, దద్దోజనం, పులిహోరా, వడపప్పు, ఇలా రకరకాల నైవేద్యాలను నివేదిస్తారు. కలియుగ వైకుంఠనాథుడు శ్రీనివాసుడి దర్శనం తర్వాత భక్తులు ఎంతగానో ఇష్టపడేది శ్రీవారి లడ్డు ప్రసాదం. భక్తులు తప్పక తమ వారి కోసం తీసుకు వెళ్ళేది లడ్డూలు. ఆ శ్రీవారికి ఎంతటి విశిష్టత ఉం దో తిరుమల లడ్డూకు కూడా అంతే ప్రాముఖ్యత, ప్రాధాన్యత ఉంది. ఆలయ పోటులో ప్రత్యేకంగా తయారయ్యే ఈ లడ్డూలను స్వామి వారి ప్రసాదంగా పెట్టడం ప్రారంభించి 308 ఏళ్ల పూర్తి అయ్యింది. 1715 ఆగస్టు 2న శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారు చేసినట్లు చెబుతుంటే.. క్రీ.శ.1803లో బూందీగా పరిచయమైన అటుతరువాత 1940 నాటికి లడ్డూ ప్రసాదంగా స్థిర పడినట్లు కొందరు పండితులు భావిస్తారు. మొదట్లో లడ్డూ ప్రసాదంను ఎనిమిది నాణేలకే ఇచ్చేవారని, అటుతరువాత 2, 5, 10, 15, 25 నుంచి ప్రస్తుతం 50 రూపాయలకు టిటిడి విక్రయిస్తోంది. 1940 వ సంవత్సరాన్ని ప్రామాణికంగా తీసుకుంటే మాత్రం లడ్డూ వయస్సు 83 సంవత్సరాలు అవుతుందని కొందరు చెబుతారు.

ఇంతటి విశిష్టత, ప్రాధాన్యత కలిగిన తిరుపతి లడ్డూకు పేటేంట్, ట్రేడ్ మార్క్ కూడా ఉన్నాయి. 2014లో తిరుపతి లడ్డూకు జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ గుర్తింపు కూడా లభించింది. ఆ విధంగా తరాలు మారుతున్నా తరగని రుచితో.. హిందువుల మనసులో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది

# భుజంపై ఉత్తరీయం!పద్ధతులు

ఉత్తరీయం వేసుకుని ఉంటే పరమ మంగళప్రదుడు.

సాధారణంగా నిత్య పూజ చేయడం అనేది పురుషుడు చేస్తాడు. ఎవరు చేయాలి అంటే యజమాని నిత్యపూజా చేయాలి. సంకల్పంలోనే ఉంది%ా% 'ధర్మపత్నీ సమేతస్య' అని ఉంది. కానీ 'పతీసమేతస్య' అని లేదు. అంటే దాని అర్థం ఇంట్లో పూజ ఇంటి యజమాని చేయాలి. ఇల్లు అభివృద్ధిలోకి రావాలి అని యజమాని కోరుకోవాలి.యజమానిగా ఉన్నవాడు అది కూడా అడగడం బరువైపోతే పూజామందిరంలోకి వెళ్ళడం ఇంక అంతకన్నా అన్యాయమైన విషయం ఏం ఉంటుంది? ఇంక దానిమీద వ్యాఖ్యానం చేయడం అనవసరం. కాబట్టి అలాగే పూజ చేస్తారు అని మనం భావన చేయాలి.పురుషుడు ప్రతిరోజూ పూజ చేస్తాడు. నైమిత్తిక తిథులలో పూజ చేసేటప్పుడు భార్య కూడా ప్రక్కన కూర్చుంటుంది.వినాయక వ్రతంలాంటిది చేసినప్పుడు. వస్త్రధారణా నియమం అన్నప్పుడు ప్రధానంగా ఆడపిల్ల అయితే లంగా వోణీ వేసుకుంటుంది, వివాహిత అయితే చీర కట్టుకుంటుంది. అమ్మవారికి అవే కదా ప్రధానం. కాబట్టి మనం కూడా అవే కట్టుకుంటాం.ఇక పురుషులకు సంబంధించి వేదం ఒక మాట చెప్పింది 'వికచ్చః అనుత్తరీయశ్చ, నగ్నశ్చావస్త్ర ఏవచ' గోచీ పోయకుండా కేవలం బట్టను చుట్టు మాత్రమే తిప్పి కట్టడం దిగంబరుడే అవుతుంది. బట్ట గోచీ పోయాలి. వెనక్కి తీసి కుచ్చిళ్ళు పోసి గోచీ వెనక్కి దోపుకోవాలి. దానిని 'కచ్ఛము' అంటారు.'వికచ్ఛః'– గోచీ పెట్టుకోలేదుటీ అనుత్తరీయశ్చ పైన ఉత్తరీయం లేదుటీ అంటే ఉత్తరీయం ఒక్కటే ఉండాలి పురుషుడికి. చొక్కా కానీ, బనీను కానీ ఏదీ ఉండకూడదు పూజ చేసేటప్పుడు.దేవాలయంలోనైనా అంతే. కళ్యాణం చేసుకోవడానికి వెళ్తే ఎవరో వచ్చి చిన్నపిల్లలకి చెప్పినట్లు చొక్కా విప్పండి, బనియను విప్పండి అని చెప్పక్కరలేదు. మనంతట మనమే తీసి కూర్చోవాలి. ఎందుకంటే భగవంతుని యొక్క అనుగ్రహాన్ని అపేక్షిస్తున్నావు. నీ గుండెలలో ఏ పరమాత్మ ఉన్నాడో వాడే ఎదురుగుండా ఉన్నాడు. వాడు వీడికి, వీడు వాడికి కనపడాలి. ఉత్తరీయం ఒక్కటే వేసుకుంటారు. గోచీపోసి పంచె కట్టుకోవాలి. ఎడమ భుజం మీద ఉత్తరీయం ఉంటే వాడు భార్యా సహితుడు, మంగళప్రదుడు అని గుర్తు. కుడి భుజంమీద ఉత్తరీయం వేసుకుంటే భార్య చనిపోయింది



అమంగళకరుడు. యజ్ఞయాగాది క్రతువులకు పనికి రాడు అని గుర్తు. అసలు ఉత్తరీయం వేసుకోకపోతే పూజకు అర్హుడు కాదు అని గుర్తు. కాబట్టి ఉత్తరీయం లేకుండా ఉండకూడదు. ఇంటికి ఎవరైనా పెద్దలు వస్తున్నారు అనుకోండి నీయందు పెద్దరికం వాళ్ళు చూస్తున్నారు అనడానికి గుర్తు స్వాగతం చెప్పడానికి ఇంటి బయటికి వచ్చిన ఇంటి యజమాని ఎడమ భుజం మీద ఉత్తరీయం ఉన్నదా లేదా అన్నది చూసుకోవాలి.నేను ఎవరి ఇంటికైనా వెళ్ళాను అనుకోండి, ఆయన ఎడమ భుజం మీద ఉత్తరీయం వేసుకుని ఎదురు వచ్చి స్వాగతం పలికాడు అనుకోండి ఆయన అభ్యున్నతి కొరకు మంచిమాటలు చెప్పవచ్చు.ఆయన అలా రాలేదు అనుకోండి నాపని చూసుకుని వెళ్ళిపోవడం మంచిది. ఎందుకంటే నాకు అయన పెద్దరికం అనడానికి గుర్తు ఏమిటంటే భుజం మీద ఉత్తరీయంతో స్వాగతం పలకాలి. మీరు గమనించండి కావ్యాలలో, పురాణాలలో భుజం మీద ఉత్తరీయంతో స్వాగతం పలికాడు అని ఉంటుంది. అప్పుడే పెద్దలు మాట్లాడతారు. కాబట్టి ఉత్తరీయం ఉండాలి. నువ్వు భగవంతుడితో సమన్వయము అవుతున్నావు. ఆయన చేయి చాపాలి, కాళ్ళు చాపాలి, ఆయన తింటే కదా నువ్వు పెట్టింది అందింది. ఆయన అనుగ్రహం చాలంటే నువ్వు మంగళప్రదుడివై అయి ఉండాలి. ఉత్తరీయం వేసుకుని ఉండాలి.'అనుత్తరీయశ్చ, నగ్నశ్చ వాడు బట్టలు లేకుండా పూజ చేశాడు అని గుర్తు. 'అవస్త్రఏవచ' మళ్ళీ నొక్కి చెప్పింది వేదం. వాడు నగ్నంగా ఉన్నాడు. నగ్నము అన్నమాటకు అర్థం అంటే దిక్కులు కప్పని వాడై ఉన్నాడు. ఒక చుట్టు చుట్టి కట్టాను అనుకోండి పూజకు పనికిరాను. గోచీపోసి కట్టి కూర్చోవాలి.

అందుకే వేదం చదువుకున్న పెద్దలు, వాళ్ళు భోజనం చేస్తుంటే కనీసం అంగవస్త్రం అంటారు చిన్న గుడ్డ అయినా సరే గోచీ పోసుకుని కూర్చుని భోజనం చేస్తారు తప్ప అసలు వికచ్చంగా భోజనం చేయరు. వికచ్చంగా పూజ దగ్గరికి వెళ్ళరు.

దేవాలయంలో అంతరాలయ ప్రవేశం చేయరు. అలా పంచె కట్టుకునేటప్పుడు ఆ పంచెకి కానీ, ఉత్తరీయానికి కానీ అంచు ఉండాలి. అంచు లేని బట్ట కట్టాడు అంటే అమంగళప్రదుడు అని గుర్తు. అవతలి వాడు పదికాలాలు బ్రతకాలి అని కోరుకుంటే అంచు ఉన్న బట్టలు తీసుకువచ్చి పెడతారు. ఒక ప్యాంటు గుడ్డ నేను పెట్టాను అనుకోండి, దానికి అంచు ఉండదు. అందుకే పీటలమీద అల్లుడికి పెట్టాలి అంటే నీకు కోటు కుట్టించాలి అని మోజు ఉంటే బయట కుట్టించు. పీటల మీద కూర్చున్నాడు భగవత్ కార్యంలో%ా%. ఆయుఃకారకం నువ్వు ఇచ్చేది. నువ్వు ఉత్తరీయం వేసుకోవాలి. ఉత్తరీయం లేకుండా బట్టలు పెట్టకూడదు. ఉత్తరీయం లేకుండా బట్టలు పుచ్చుకోకూడదు. అంచు ఉన్న బట్టలు పెట్టాలి. అందుకే ఇప్పటికీ మనవాళ్ళు పంచెల చాపు పెడతారు.పరమమంగళప్రదుడు అనడానికి గుర్తు అంచు ఉన్న బట్ట గోచీ పోసుకుని కట్టుకుని ఉత్తరీయం వేసుకుని ఉంటే పరమ మంగళప్రదుడు. శౌచంతో ఉన్నాడు అని గుర్తు. పూజ దగ్గరికి వెళితే లాల్చీ, బనియను కూడా పనికిరావు. తీసేసి ఉత్తరీయం కప్పుకుని గోచీ పోసి పంచె కట్టుకుని కూర్చుని పూజ చేయాలి. గోచీ ఎంత బాగా పోయాలి. అంచు ఎంత బాగా మడత పెట్టాలి సంబంధం లేదు. ఒక అంచు తీసి నీకు వచ్చినట్లు దోపుకుంటే చాలు కచ్చ ఉన్నట్లే. కాబట్టి పురుషుడికి పూజ చేసేటప్పుడు వస్త్రధారణయందు అటువంటి నియమము ఉన్నది. అదేం పెద్ద విశేషమా? అదేం బ్రహ్మవిద్యేం కాదు. పూజయందు ఎప్పుడూ గోచీపోసి పంచె కట్టుకుని ఉత్తరీయం వేసుకుని పురుషుడు పూజ చేయవలసి ఉంటుంది.

. సర్వం శ్రీకృష్ణార్పణమస్తు

**ప్రపంచం మొత్తం జరుపుకునే సెలబ్రేట్ చేసుకునే వేడుకల్లో ఆంగ్ల సంవత్సరాది ఒకటి. ఏంటీ అప్పుడే 2023 గడిచిపోయిందా? అనే సందేహం వస్తోందా! అంతే కదండీ.. కాలం.. పల్లె ఆర్డినరీ బస్‌లా కాకుండా జెట్ స్పీడ్ బుల్లెట్ ట్రైన్ దూసుకెళ్లినట్లుగా గడిచిపోతోందంతే! ఈ వేడుక మన ఆలోచనలు, భావజాలానికి కూడా కొత్తదనాన్ని తెస్తుంది. జీవితంలో మరింత మెరుగ్గా ఉండేందుకు, కొత్త లక్ష్యాలను నిర్దేశించుకోని ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి ఈ న్యూ ఇయర్ ప్రారంభంలో మంచి నిర్ణయాలు తీసుకోవడం ఉత్తమం.**

# జీవితం ధన్యం
# ఉత్తర ద్వార దర్శనం




**ప్రతి సుమం సుగంధ బరితం ఈ కొత్త సంవత్సరం లో.. మీకు పతీక్షణం ఆనందబరితం**

**నూతన సంవత్సర శుభాకాంక్షలు**

ప్రపంచంలో వివిధ ప్రాంతాలలో సంవత్సరాది పండగను వివిధ దినాలలో జరుపుకుంటారు. ఇలా జరుపుకోవడానికి కారణం సంవత్సర పరిగణన వేరువేరు మాసాలలో జరగడమే. ప్రపంచంలో అత్యధికులు ఆచరించేది ప్రస్తుత గ్రెగేరియన్ క్యాలెండర్ క్రీ.శ.1582లో రూపొందించినది. జనవరి 1వ తేదీన నూతన సంవత్సర తొలి రోజును పండగలా జరుపుకోవడం సాపేక్షంగా కొత్త దృగ్విషయం.

క్రీ.పూ.2000లో వసంత సమరాత్రి సమయాన మార్చి మధ్య కాలంలో మెసపొటేమియాలో నూతన సంవత్సర ఉత్సవాలు తొలి నాళ్ళలో జరుపుకునే వారు. అలాగే వివిధ ప్రాంతాలలో రుతు సంబంధంగా ప్రాచీనులు విభిన్న రోజులలో సంవత్సరాదిని పాటించేవారు. ఈజిప్టియన్లు, ఫొయెనిషియన్లు, పర్షియన్లు సమర్రాతి ప్రారంభం, గ్రీకులు శీతకాల ఆయనాంత సమయాన జరుపుకునే వారు. పూర్వపు రోమన్లు మార్చి నెల 1వ తేదీని కొత్త సంవత్సర ఆరంభ దినంగా నియమం పెట్టుకున్నారు. ఆనాటి క్యాలెండర్ మార్చితో ప్రారంభమై 10నెలలతో కూడి ఉండేది. లాటిన్ లో "సెప్టెం" అనగా ఏడు అని, "అక్టో" అనగా ఎనిమిది అని "నొవం" అనగా తొమ్మిది అని, "దశం" అనగా పది అని అర్ధం. క్రీ.పూ.153లో ప్రప్రథమంగా జనవరి 1న నూతన సంవత్సర తొలి రోజుగా పరిగణించారు. వాస్తవానికి క్రీ.పూ.700 వరకు జనవరి మాసం ఉనికే లేదు. రోమ్ రెండవ రాజైన నుర్మా పొంటిలియస్ జనవరి, ఫిబ్రవరి మాసాలను జత చేయడం జరిగింది. రోమ్ సామ్రాజ్యంలో పౌర యుద్ధం చోటు చేసుకుని, గణతంత్ర రాజ్యంలో ఇరువురు ఉన్నతాధికారులైన అమాత్యులు కొత్తగా ఎన్నికైన సందర్భాన వారి పదవీ కాలాన్ని ఏడాదిగా నిర్ణయించారు. ఆ సందర్భంగా మార్చి నుండి జన వరికి తొలి రోజును మార్చినా, అది ఖచ్చితంగా పాటించ బడలేదు. అప్పటికీ మార్చి 1ననే కొత్త సంవత్సర వేడుకలు జరిగేవి.

క్రీ.పూ.46లో జూలియస్ సీజర్ ప్రాచీన చాంద్రమానాధారిత రోమన్ క్యాలెండర్ ను మెరుగు పరిచి, సౌర మాన ఆధారిత నూతన క్యాలెండర్ ను పరిచయం చేయగా, సదరు క్యాలెండర్ జనవరి 1ననే కొత్త సంవత్సర ప్రారంభ దినంగా పరిగణింప చేయగా, అది క్రమేణ నిలకడగా పాటించ బడింది. మధ్యయుగాన ఐరోపాలో నూతర వత్సర సంబరాలు అన్యమత సంబంధమైనవిగా భావించ బడగా, క్రీ.శ.567లో జనవరి 1వ తేదీన నూతన సంవత్సర ప్రారంభ దినాన్ని పాల కులచే రద్దు చేయబడింది.




మధ్యయుగ క్రైస్తవులు ఐరోపాలో చాలా వరకు కొత్త సంవత్సర దిన వేడుకలను జీసస్ జన్మదిన సందర్భంగా డిసెంబర్ 25న, మార్చి 1న, మార్చి 25న, ఈస్టర్ సందర్భంగా పాటించేవారు.

1582వ సంవత్సరంలో సంస్కరింపబడి, పునరుద్ధరింప బడిన గ్రెగేరియన్ క్యాలెండర్ జనవరి 1వ తేదీని ప్రకటింపగా, వెను వెంటనే చాలా వరకు క్యాథలిక్ దేశాలు స్వీకరించాయి. తర్వాత క్రమంగా ప్రొటెస్టెంట్ దేశాలు కూడా స్వీకరించాయి. అయితే 1752 వరకు బ్రిటిషర్లు స్వీకరించలేదు. అప్పటికీ బ్రిటిష్ సామ్రాజ్యం, వారి అమెరికన్ కాలనీలు మార్చి మాసంలోనే నూతన సంవత్స వేడుకలు జరుపుకునే వారు. 1752 తర్వాత బ్రిటిష్ రాచరిక పాలకులు తమ ఆధీనంలోని దేశాలన్నింటిలో జన వరి 1వ తేదీని నూతన సంవత్సర తొలి రోజుగా ఆచరించే చర్యలు గైకొన్నారు. మొట్టమొదటి సారిగా గ్రెగేరియన్ క్యాలెండర్ కు, జూలియస్ సీజర్ క్యాలెండర్ కు గల రోజుల వ్యత్యాసాన్ని సవరించి, 1582 అక్టోబర్ మాసంలో 5 నుండి 14వ తేదీలను ఇటలీ, పోర్చుగల్, స్పెయిన్, పోలండ్ దేశాలలో లేకుండా చేసి, 4తర్వాత 15ను మార్చడం జరిగింది. 1752 సెప్టెంబరులో 3నుండి 13 తేదీలు తొలగించి, 11రోజులను లేకుండా సరి చేశారు..

జనవరి 7 ఈజిప్టియన్లు, 11న ఓల్డ్ స్కాటిష్, 14న ఈస్ట్రన్ ఆర్థడాక్స్, 21న కొరియన్లు, మార్చి 1న రోమన్లు, ఏప్రిల్ 13,14ను (బైసాకి) నానక్ సాహి క్యాలెండర్ ఆధారంగా సిక్కులు, ఉగాదిని తెలుగువారు, ఏప్రిల్ 14ను అగ్నేయాసియా దేశాలు, ఏప్రిల్ మొదటి వారంలో పౌర్ణమిని బౌద్ధులు, మొహర్రం నెల మొదటి రోజు ఇస్లాం, జూన్ 21ని ఏనిషియెంట్ గ్రీక్, జూలై 8ని ఆర్మేనియన్, ఆగస్టు 8ని మళయాళీలు, 23ను జొరాష్ట్రియన్, సెప్టెంబర్ 1ని రష్యన్ ఆర్తడాక్స్ క్రిస్టియన్, 11ను ఇథియోపియన్, అక్టోబర్ 3ను మొరాకో, నవంబర్ లో దీపావళిని జైనులు, డిసెంబర్ లో సిక్కిం న్యూ ఇయర్ డేగా పాటించడం అనవాయితీ.

(మిగతా 8వ పేజీలో)

(7వ పేజీతరువాయి)



అవును. క్యాలెండర్ లో సంవత్సరం మారినంత మాత్రాన మన అదృష్టం, తల రాతలు మారవు. కొత్త సంవత్సరమంటే ప్రతి ఒక్కరిలోనూ కొత్త ఉత్సాహం నిండుతుంది. నూతన సంవత్సరాన్ని ఆహ్వానించేందుకు అర్ధరాత్రి వరకు అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తూ ఉంటారు. డిసెంబర్ 31 రాత్రి అట్టహాసంగా సంబరాలు , వేడుకలు చేసుకున్నంత మాత్రాన రాబోయే సంవత్సరం అంత సంతోషంగా ఉంటామనే సెంటిమెంట్ తప్పు. ప్రస్తుత సంవత్సరంతో ముడిపడి ఉండేదే నూతన సంవత్సరం. నూతన సంవత్సరం అనేది ఒక పండుగ కాదు కేలండర్ లో వచ్చే మార్పు. మరియు ఈ క్రొత్త సంవత్సరం హిందూ సోదరులది కాదు ముస్లిం సోదరులది కాదు.

హిందువులకు ఉగాది నూతన సంవత్సరం అయితే, ముస్లింలకు మొహర్రమ్ గా పరిగణిస్తారు. బ్యాంకింగ్ మరియు ఆర్థిక కార్యకలాపాలకు ఏప్రిల్ 1 ని నూతన సంవత్సరంగా పరిగణిస్తారు. విద్యార్థులకు జూన్ ను నూతన సంవత్సరంగా చెప్పుకోవచ్చు. అయితే మనదేశం లో ఆంగ్ల కేలండర్ నే ప్రామాణికంగా తీసుంటారు కాబట్టి జనవరి ఒకటో తారీఖున క్రొత్త సంవత్సరంగా పరిగణిస్తారు. అయితే ఈ రోజు ప్రతి ఒక్కరు సంబరాలు చేసుకోవడానికి ఎంత ప్రాధాన్యమిస్తారో అంతే ఎక్కువగా మనం గత సంవత్సరంలో సాధించిన విజయాలను మరియు చవిచూసిన అపజయాలను విశ్లేషించాలి మరియు ఈ సంవత్సరంలో ఛేదించాల్సిన లక్ష్యాలను గుర్తించి సంబంధిత ప్రణాళికలను రూపొందించుకోవాలి. మరియు గత సంవత్సరం లో చేసిన పొరపాట్లు పునరావృతం కాకుండా జాగ్రత్త పడాలి. అప్పుడే నూతన సంవత్సరాన్ని సంపూర్ణంగా ఆహ్వానించినట్లు అవుతుంది. అనుకున్నట్లు ప్రణాళికలను అమలు చేసి విజయం సాధించినప్పుడే ఒక సంవత్సరానికి మంచి ముగింపును ఇవ్వగల్గుతాము. నూతన సంవత్సరం సాకుతో డబ్బు వృథాచేసుకొకూడదని మనవి.





క్రొత్త సంవత్సరం సంబరాలు ఎవరు మొదటగా జరుపుకుంటారు

కొత్త సంవత్సరం అంటేనే కొత్త ఆశలు, కొత్త ఆలోచనలు, తీర్మానాలు. ఆ మధురక్షణాలకోసం ప్రతిఒక్కరూ ఎదురుచూస్తూనే ఉంటారు. అయితే అసలు ఈ కొత్త సంవత్సర వేడుకలు జరుపుకునే సాంప్రదాయం ఎప్పుడు మొదలైందనే విషయంపై భిన్నవాదనలున్నాయి. జూలియన్ క్యాలెండర్ విషయంపై భిన్నవాదనలున్నాయి. జూలియన్ క్యాలెండర్ లేదా గ్రిగోరియన్ క్యాలెండర్ ప్రకారం జనవరి ఒకటో తేదీని ప్రపంచవ్యాప్తంగా నూతనసంవత్సర ఆరంభదినంగా తీర్మానించారు. దాదాపుగా క్రీస్తు పూర్వం 2000 సంవత్సరాల నుంచే నూతన సంవత్సర వేడుకలు చేసుకుంటున్నారని ఒక అంచనా. ప్రాంతాలు, సంస్కృతి సంప్రదాయాలను బట్టి కొన్ని దేశాలు ఇతర తేదీలను కూడా సంవత్సరాదిగా పాటిస్తున్నాయి. రష్యా వంటి కొన్ని దేశాలు ఒక్క ఏడాదిలోనే రెండుసార్లు నూతన సంవత్సర వేడుకలు చేసుకుంటాయి.

భూభ్రమణాన్ని బట్టి వివిధ టైంజోన్ల కారణంగా ఒక్కో ప్రాంతంలో ఒక్కోసారి కొత్త సంవత్సరం ప్రారంభమవుతుంది. అయితే, వివిధ టైం జోన్ల కారణంగా మనకంటే ముందే కొన్ని దేశాల్లో కొత్త సంవత్సరం ఆరంభమవుతుంది. అలాగే మరికొన్ని దేశాల్లో మన తర్వాత కొత్త సంవత్సరం వేడుకలు జరుగుతాయి. ప్రపంచవ్యాప్తంగా మొట్టమొదటగా నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికేదెవరో, చిట్టచివరగా ఈ సంవత్సరానికి వీడ్కోలు పలికేదెవరో పరిశీలిస్తే, ప్రపంచంలో అందరికంటే మొదటగా న్యూజిలాండ్లో న్యూ ఇయర్ ప్రవేశిస్తుంది. న్యూజిలాండ్ ఛాథమ్ దీవుల్లో మొట్టమొదట న్యూ ఇయర్ వేడుకలు చేసుకుంటారు. ఇక్కడ వేడుకలు మొదలైన ఇరవై నాలుగు గంటల తర్వాత భూగోళం మీద అందరికంటే చివరిగా, అమెరికాలోని సమోవా దీవుల్లో నూతన సంవత్సర వేడుకలు జరుగుతాయి. విచిత్రం ఏమిటంటే, న్యూజిలాండ్లోని ఛాథమ్ దీవులకు, సమోవా దీవులకు మధ్య దూరం కేవలం 554 మైళ్ళే! విమానంలో కేవలం గంట ప్రయాణం! ఆసక్తి, ఉత్సాహం ఉన్నవాళ్ళు ఒకేరోజులో రెండుసార్లు నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొనవచ్చు.



# బ్రిటీషు ఇండియాలో భారత ప్రామాణిక కాలమానం అమలు



1906, జనవరి 1 నుండి భారతదేశంలో ఏకైక ప్రామాణిక సమయం అమలు కావడం ప్రారంభం అయింది.

భారత దేశంలో అమలులో ఉన్న భిన్నాంశ కాలమానాన్ని (%ఖుజ%ం5:30) ఖగోళకారుడు జాన్ గోల్డింగ్‌హామ్ స్థాపించాడని భావిస్తారు. భారత ప్రామాణిక కాలమానం (%×అఎఖుఅ ళ్ఖుఅ-ఖుతీస ఎఅఎవ - ×యీ%) భారతదేశ మంతటా పాటించే సమయం. ఇది గ్రీన్‌విచ్ (%+తీవవఅఱఅష్ట్ర%) సమయానికి ఐదున్నర గంటలు (%ఖుజ%ం5:30) ముందు ఉంటుంది. బ్రిటీషు నావికుడు-ఖగోళకారుడు మైఖెల్ టాపింగ్ కృషి ఫలితంగా 1792లో, బ్రిటీషు ఈస్టిండియా కంపెనీ అప్పటి మద్రాసులో మద్రాసు అబ్జర్వేటరీని ప్రారంభిం చింది. 1802లో భారత దేశంలో ఈస్టిండియా కంపెనీ  అధికారిక ఖగోళ కారునిగా నియమితుడైన జాన్ గోల్డింగ్‌హామ్, గ్రీన్‌విచ్ ప్రామాణిక సమయానికి ఐదున్నర గంటలు ముందున్న మద్రాసు రేఖాంశం (13ళీ5′24″%చీ 80ళీ18′30″జు / 13.09000ళీచీ 80.30833ళీజు%) ను స్థానిక ప్రామాణిక సమయంగా స్థిర పరిచాడు. దీనితో ప్రస్తుతము ఉపయోగిస్తున్న ప్రమాణిక సమయానికి అది ప్రాతిపదిక అయింది. అప్పటి వరకు ప్రామాణికంగా ఉపయోగిస్తున్న సమయంలో రోజు సూర్యోదయంతో ప్రారంభ మయ్యేది. అయితే కొత్త పద్ధతిలో రోజు అర్ధరాత్రి ప్రారంభ మవుతుంది. బొంబాయి నౌకాశ్రయములో నౌకా కార్యకలపాలకు సమయ పాలనా మద్దతును 1862లో స్థాపించబడిన కొలాబా అబ్జర్వేటరీ అందించేది.

చరిత్రలో మొట్టమొదటగా ప్రామాణిక సమయం వివరణ భారతదేశంలో 4వ శతాబ్దపు భారతీయ ఖగోళశాస్త్ర ఆధారిత సూర్య సిద్ధాంతంలో ఇవ్వబడింది. దీనిలో భూమి గుండ్రంగా ఉందని ప్రతిపాదిస్తూ, ప్రైమ్ మెరీడియన్ లేదా “జీరో డిగ్రీల రేఖాంశం” అవంతీ నగరం ( –È¨sTT“¿ì (23°10′58″%N 75°46′38″E / 23.18278°N 75.77722°E%), పూర్వపు పేరు) , రోహితక ( కురుక్షేత్ర యుద్ధభూమి దగ్గరలోని నగరం రోహ్‌తక్) (28ళీ54′%చీ 76ళీ38′జు / 28.900ళీచీ 76.633ళీజు%) గుండా వెళుతుందని నిర్వచించ బడింది. రోహితక, అవంతి నగరాలు (భూమధ్యరేఖ, 76ళీ తూ) , దేవతల ఆవాసమైన కైలాస పర్వతం (ఉత్తర ధృవం) గుండా వెళుతున్న సరళ రేఖపై ఉన్నాయి.సాధారణ ఉపయోగములో ఉన్న సమయమే గణించగల సమయము. ప్రాణంతో (ఒక శ్వాసకు పట్టే సమయం) ప్రారంభమై, ఆరు ప్రాణాలు ఒక విఘటిక లేదా పలం, 60 విఘటికలు ఒక ఘటిక, 60 ఘటికలు ఒక నక్షత్ర అహోరాత్రి, లేదా ఒక ఖగోళ దినంగా గణిస్తారు. ఒక నక్షత్ర మాసం లేదా ఖగోళ మాసంలో 30 అహోరాత్రులు లేదా రోజులు ఉంటాయి.

ఒక రోజుకు 24 గంటలుగా పరిగణిస్తే, ఈ కాలమానంలోని అత్యంత చిన్న కొలత, ప్రాణం, లేదా ఒక ఉచ్ఛ్వాసనిశ్వాసం నాలుగు సెకన్లకు సమాన మవుతుంది. ఇది ఆధునిక వైద్యశాస్త్ర పరిశోధనలు సాధారణ ఉచ్ఛ్వాసనిశ్వాస పౌనపున్యంగా భావించే నిమిషానికి 15 శ్వాసలకు సరిపోతుంది. సూర్య సిద్ధాంతం, స్థానిక సమయము నుండి ఉజ్జయినీ ప్రామాణిక సమయాన్ని గణించే పద్ధతిని కూడా వివరించింది. భారతీయ కాలమానం చాలా ముందే ఈ ప్రగతిని సాధించినప్పటికీ, ప్రామాణిక సమయం, ఖగోళ శాస్త్రంలో తప్ప వేరెక్కడా విరివిగా ఉపయోగించ బడలేదు.

భారతదేశాన్ని పరిపాలించిన రాజులు, తమ సామ్రాజ్యాలలో, చాలా వరకు భారతీయ పంచాంగం సహాయముతో గణించిన స్థానిక సమయాన్నే పాటించారు.

పూర్వపు భారతీయ ఖగోళ శాస్త్రజ్ఞులు ఉపయోగించే రోజు ఉజ్జయిని లోని ప్రైమ్ మెరీడియన్ వద్ద సూర్యుడు ఉదయించ డముతో ప్రారంభ మవుతుంది. అలా ప్రారంభ మయిన రోజు చిన్న చిన్న సమయ ఖండాలుగా విభజించ బడినది.

1884లో, వాషింగ్టన్, డి.సిలో జరిగిన అంతర్జాతీయ మెరిడియన్ సమావేశం ప్రపంచమంతటా ప్రామాణిక కాలమండలాలను వ్యవస్థీకరించింది. ఆ సమావేశంలో భారతదేశంలో రెండు కాల మండలాలు ఉండాలని నిర్ణయిం చింది. కలకత్తా తూర్పు 90 డిగ్రీల రేఖాంశంను, బొంబాయి తూర్పు 75డిగ్రీల రేఖాంశం ఉపయోగించేది. కలకత్తా సమయం గ్రీన్విచ్ కంటే 5 గంటల 30 నిమిషాల 21 సెకన్లు, బొంబాయి సమయం గ్రీన్విచ్ కంటే 4 గంటల 51 నిమిషాలు ముందు ఉండేట్టు నిర్ణయ-ంమైంది. 1880ల చివరికల్లా, చాలామటుకు రైల్వే కంపెనీలు రెండు కాలమండలాలకు మధ్యేమార్గంగా రైల్వే సమయంగా పేరొందిన మద్రాసు సమయంను ఉపయోగించడం ప్రారంభించాయి. అండమాన్ నికోబార్ దీవులు రాజధాని అయిన పోర్ట్ బ్లెయిర్ లో పోర్ట్ బ్లెయిర్ మీన్ టైం అనే మరొక ప్రత్యేక కాలమండలం స్థాపించ బడింది. పోర్ట్ బ్లెయిర్ సమయం, మద్రాసు సమయం కంటే 49 నిమిషాల 51 సెకన్లు ముందు ఉండేది.

భారత ప్రామాణిక కాలమానాన్ని 82.5ళీతూర్పు రేఖాంశం ఆధారంగా లెక్కకడతారు. ఈ రేఖాంశం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అలహాబాదు నగరం దగ్గరున్న మిర్జాపూర్ పట్టణానికి కొంచెం పశ్చిమంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని కాకినాడ నగరం మీదుగా వెళుతుంది. మిర్జాపూరు, యునై టెడ్ కింగ్‌డం యొక్క గ్రీన్‌విచ్ లోని రాయల్ అబ్జర్వేటరీల మధ్య రేఖాంశ అంతరం కచ్చితంగా 5 గంటల 30 నిమిషాలు. ఆధికారిక సమయపాలనా యంత్రాగం ఢిల్లీ లోని భారత జాతీయ భౌతిక ప్రయోగశాలకు సమయ పాలన బాధ్యతను అప్పగించినా, స్థానిక సమయాన్ని అలహాబాద్ అబ్జర్వేటరీ (25.15° N 82.5° E%) వద్ద ఉన్న గడియార స్తంభం నుండి లెక్కకడతారు.

భారతదేశంలో అనేక పట్టణాలు 1850లలో రైల్వేలు వచ్చిన తర్వాత కొద్ది సంవత్సరాలకు కూడా తమ సొంత స్థానిక సమయాన్నే ఉపయోగించేవి. రైల్వేల రాకతో ఒక సమైక్య ప్రామాణిక సమయం యొక్క ఆవశ్యకత ఏర్పడింది. అప్పటి బ్రిటీషు ఇండియాలోని రెండు ముఖ్యపట్టణాలైన బొంబాయి , కలకత్తాల స్థానిక సమయాలు ప్రాధాన్యత సంతరించు కున్నాయి. క్రమేణ వాటి చుట్టుపక్కల ప్రాంతాలు , సంస్థానాలు ఈ ప్రామాణిక సమయాన్ని అవలంబించాయి. 19వ శతాబ్దంలో గడియారాలను టెలిగ్రాఫు ద్వారా ఒకే సమయము ఉండేట్టు చేసేవారు (సింక్రొనైజ్) ఉదాహ రణకు రైల్వేలు తమ గడియా రాలని ప్రతిరోజూ ఒక నిర్ణీత సమయంలో ముఖ్య కార్యాలయం లేదా ప్రాంతీయ కార్యాలయం నుండి పంపే సమయ సంకేతం ద్వారా సింక్రొనైజ్ చేసేవారు.

అయితే బ్రిటీషు ఇండియా 1905 వరకు అధికారికంగా ప్రామాణిక కాలమండలాలను నిర్ణయించ లేదు. 1905లో ఏకైక ప్రామాణిక సమయాన్ని స్థాపిస్తూ అలహా బాదుకు తూర్పుగా వెళ్ళే 82.5 డిగ్రీల తూర్పు రేఖాంశాన్ని భారత దేశ కేంద్ర మెరిడియన్ గా ఎంచు కున్నది. ఇది 1906, జనవరి 1 నుండి భారత దేశంతో పాటు శ్రీలంకలో కూడా అమలులోకి వచ్చింది. కానీ, కలకత్తా సమయంను మాత్రం 1948 వరకు అధికారికముగా, ప్రత్యేక కాలమండలంగానే నిర్వహించారు.

ఇతర సరిహద్దు దేశాలతో సంబంధంలో భాప్రాకా1925లో, టైం సింక్రొనైజేషన్ సంకేతాన్ని ఆమ్నిబస్ టెలిఫోన్ వ్యవస్థ ద్వారా, నియంత్రిత సర్క్యూట్ల ద్వారా కచ్చితమైన సమయం కావలసిన సంస్థలకు ప్రసారం చేసేవారు. ఈ పద్ధతి 1940ల వరకు కొనసాగింది. తర్వాత  ప్రభుత్వ సమయ సంకేతా లను రేడియో ద్వారా ప్రసారం చెయ్యటం ప్రారంభించింది.

1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, భారత ప్రభుత్వం భారత ప్రామాణిక సమయాన్ని దేశం మొత్తానికి అధికారిక సమయంగా ప్రకటించింది.

వాణిజ్య , అధికారిక ఉపయోగాల కోసం అధికారిక సమయ సంకేతాలు కొత్త ఢిల్లీలోని జాతీయ భౌతిక పరిశోధనశాల వద్ద ఉన్న సమయ, పౌన:పున్య ప్రామాణిక పరిశోధనశాల ద్వారా వెలువడ తాయి. ఈ సంకేతాలు విశ్వవ్యాప్త సమన్వయ సమయ మునకు మద్దతునిచ్చే ప్రపంచ వ్యాప్త గడియార వ్యవస్థతో అను సంధానించ బడిన అటామిక్ క్లాక్ ఆధారంగా వెలువడుతాయి.

నిర్దిష్టమైన సమయాన్ని దేశ మంతటా ప్రభుత్వా ధీనంలో ఉన్న ఆలిండియా రేడియో , దూర దర్శన్ టెలివిజన్ నెట్‌వర్కుల ద్వారా ప్రసారం చేస్తారు. టెలిఫోన్ కంపెనీలు వినియోగదారులకు కచ్చితమైన సమయాన్ని తెలియ జేసేందుకు ప్రత్యేకంగా నియమిం చిన టెలిఫోన్ నంబర్లు టైం సర్వర్ మిర్రర్లకు అనుసంధా నించబడి ఉంటాయి. కచ్చితమైన సమయం తెలుసు కోవటానికి గణనీయంగా పెరుగు తున్న మరో ప్రాచుర్యమైన పద్ధతి గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (జి.పి.ఎస్) రిసీవర్లు.

## సినిమా రివ్యూ

నందమూరి కళ్యాణ్ రామ్ హీరోగా నటించిన తాజా సినిమా 'డెవిల్'. ది బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్... అనేది ఉపశీర్షిక. విడుదలకు ముందు ప్రచార చిత్రాలు ప్రేక్షకుల్ని ఆకర్షించాయి. అంచనాలు పెంచాయి. మరి, సినిమా ఎలా ఉంది? మిస్టరీ థ్రిల్లర్ మూవీ మెప్పిస్తుందా? లేదా?

**కథ :**
రాసపాడులో జమీందారు కుమార్తె హత్యకు గురవుతుంది. ఆ కేసును తమ ఏజెంట్ డెవిల్ (నందమూరి కళ్యాణ్ రామ్)కు అప్పగిస్తుంది బ్రిటీష్ ప్రభుత్వం! జమీందారు మేనకోడలు నైషధ (సంయుక్తా మీనన్)తో డెవిల్ ప్రేమలో పడతాడు. అదంతా దర్యాప్తులో భాగమని చెబుతాడు. 'డెవిల్'ను బ్రిటీష్ ప్రభుత్వం రాసపాడు పంపినది జమీందారు హత్య కేసు దర్యాప్తు కోసం కాదని, ఇండియాకి వస్తున్న ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్, ఆయన అనుచరుడు త్రివర్ణ(?)ను పట్టుకోవడం కోసమని తెలుస్తుంది. ప్రేమ నాటకం సైతం అందులో భాగమే అంటాడు డెవిల్. నైషధకు, నేతాజీకి సంబంధం ఏమిటి? త్రివర్ణ ఎవరు? ఈ కథలో రాజకీయ నాయకురాలు మణిమేఖల (మాళవికా నాయర్) పాత్ర ఏమిటి? ప్రేమ పేరుతో డెవిల్ చేసింది ఏమిటి? ఆ ప్రేమ నిజమా? కాదా? నేతాజీ గురించి చివరకు తెలిసింది ఏమిటి? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి.

**విశ్లేషణ:**
గూఢచారి కథలు ఎప్పుడూ ఎవర్ గ్రీన్ ఫార్ములా! అందులోనూ బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్ అనేసరికి ఇంకాస్త అంచనాలు పెరిగాయి. పైగా, దర్శకుడు మారడంతో పాటు విదేశీ నటుడు సోషల్ మీడియాలో చేసిన పోస్టులు సినిమాకు ఇంకాస్త ప్రచారాన్ని తీసుకొచ్చాయి. మరి, సినిమా ఎలా ఉంది? అనేది చూస్తే... 'డెవిల్'ను యాక్షన్ థ్రిల్లర్ అనడం కంటే మిస్టరీ డ్రామాగా పేర్కొనడం మంచిది. సినిమాలో యాక్షన్ లేదని కాదు. షిప్ ఫైట్ ద్వారా హీరోని ఇంట్రడ్యూస్ చేశారు. సముద్ర తీరంలో యాక్షన్ సీక్వెన్స్‌తో సినిమా ముగించారు. మధ్యలో పిండారీలతో హీరో చేసే ఫైట్, బ్రిటీష్ జైలులో యాక్షన్ సీక్వెన్స్ చక్కగా డిజైన్ చేశారు. యాక్షన్ మధ్యలో కథ, క్యారెక్టర్లు చాలా ఎక్కువ ఉన్నాయి. ఎక్కువ డ్రామా ఉంది.మర్డర్ మిస్టరీతో 'డెవిల్'ను ప్రారంభించిన దర్శక రచయితలు... ఇంటర్వెల్ వరకు ఒక క్యారెక్టర్ తర్వాత మరొక క్యారెక్టర్ ఇంట్రడ్యూస్ చేస్తూ నిడివి పెంచుకుంటూ వెళ్ళారు. మధ్యలో



ప్రేమకథ కూడా అడ్డు తగిలింది. ఒక దశకు వచ్చిన తర్వాత అసలు కథ ఏమిటి? అనేది మర్చిపోయి కొసరు అంశాలతో సంతృప్తి చెందుతాం. ఇంటర్వెల్ దగ్గర సినిమాలో అసలైన క్యూరియాసిటీ, మిస్టరీ మొదలు కావడంతో సెకండాఫ్ మీద ఇంట్రెస్ట్ క్రియేట్ అవుతుంది. ఇంటర్వెల్ తర్వాత ట్విస్టులు, టర్నులు బావున్నాయి. సినిమా చివరి వరకు ఆ సస్పెన్స్ మైంటైన్ చేశారు. నెక్స్ట్ ఏంటి? నెక్స్ట్ ఏంటి? అని ప్రేక్షకుడు ఆసక్తిగా చూసేలా సినిమా తీశారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ నేపథ్యంలో, ఆయన పేరు వాడుతూ తీసిన సన్నివేశాలు బావున్నాయి. బహుశా... నేతాజీ నేపథ్యాన్ని ఈ మధ్య కాలంలో ఇంత చక్కగా వాడుకున్న సినిమా ఇదేనేమో!?'యానిమల్'తో సంగీత దర్శకుడు హర్షవర్ధన్ రామేశ్వర్ పేరు మార్మోగింది. ఈ చిత్రానికి ఆయన సంగీతం అందించారు. పాటల్లో 'మాయే చేసె...' విడుదలకు ముందు సూపర్ హిట్ అయ్యింది. పిక్చరైజేషన్ కూడా బావుంది. నేపథ్య సంగీతం 'యానిమల్' స్థాయిలో లేదు. కానీ, సన్నివేశాలకు తగ్గట్టు చేశారు. యాక్షన్ సీన్లలో కాస్త పర్వాలేదు. సినిమాటోగ్రఫీ ఉన్నత స్థాయిలో ఉంది. నిడివి తగ్గిస్తే సినిమా మరింత రేసీగా ఉంటుంది. సస్పెన్స్ మిస్టరీ మరింత వర్కవుట్ అయ్యేవి. సినిమాకు భారీగా ఖర్చు చేశారని తెరపై ఆ సన్నివేశాలు చూస్తే ఈజీగా చెప్పవచ్చు. డబ్బులు ఖర్చు చేసే విషయంలో అభిషేక్ నామా రాజీ పడలేదు. అయితే, యాక్షన్ సన్నివేశాల్లో వీఎఫ్ఎక్స్ మీద మరింత దృష్టి పెట్టాల్సింది. ముఖ్యంగా క్లైమాక్స్ ఫైటులో వీఎఫ్ఎక్స్ తేలిపోయాయి.

**నటీనటులు ఎలా చేశారంటే:**
'డెవిల్'కు కళ్యాణ్ రామ్ 100 శాతం న్యాయం చేశారు. పాత్రకు అవసరమైన ఆహార్యంలోకి మారారు. కథా నేపథ్యానికి తగ్గట్టు డైలాగులు చెప్పారు. యాక్షన్ సీక్వెన్సులలో మరోసారి అదరగొట్టారు. కళ్యాణ్ రామ్ డైలాగ్ డెలివరీ సినిమాకు పెద్ద ప్లస్. ఆయన డ్రెసింగ్ స్టైల్ కూడా బావుంది. అయితే... హిందీ సినిమా 'డిటెక్టివ్ బ్యూమకేష్ భక్షి' స్ఫూర్తితో కళ్యాణ్ రామ్ డ్రెసింగ్ డిజైన్ చేసినట్లు అనిపించింది.
సంయుక్తా మీనన్ కు కథలో మంచి వెయిటేజ్ ఉన్న క్యారెక్టర్ లభించింది. ఆమె నటన పర్వాలేదు. 'మాయే చేసె...' పాటలో కళ్యాణ్ రామ్, సంయుక్త జోడీ చాలా బావుంది. మాళవికా నాయర్ కు మణిమేఖల తరహా రోల్ రాబోయే రోజుల్లో వస్తుందో? లేదో? స్క్రీన్ మీద కనిపించేది తక్కువ సేపే అయినప్పటికీ... మంచి ఎలివేషన్ లభించింది. ఆమె సన్నివేశాలు ప్రేక్షకులకు గుర్తు ఉంటాయి. ఓ పాటలో, రెండు మూడు సన్నివేశాల్లో ఎల్నాజ్ నోరౌజీ అలరించారు. 'స్వామి రారా' సత్య, షఫీ, 'రంగస్థలం' మహేష్, అజయ్, ఎస్తేర్ నోర్హా, సీనియర్ నటి సీత, శ్రీకాంత్ అయ్యంగార్, వశిష్ఠ సింహా, మౌనికా రెడ్డి, విదేశీ నటీనటులు తదితరులు తమ తమ పాత్రల పరిధి మేరకు నటించారు.

**చివరగా చెప్పేది ఏంటంటే:**
'డెవిల్'లో కథానాయకుడు కళ్యాణ్ రామ్ మరోసారి తనదైన నటనతో ఆకట్టుకున్నారు. సినిమా కథా నేపథ్యం బావుంది. ప్రారంభంలో పాత్రల పరిచయానికి కాస్త ఎక్కువ సమయం తీసుకున్నప్పటికీ... ఇంటర్వెల్ ముందు దర్యాప్తులో ఆసక్తి మొదలైంది. ఆ ట్విస్టులు వర్కవుట్ అయ్యాయి. మిస్టరీ డ్రామాలను ఇష్టపడే ప్రేక్షకులు ఎటువంటి అంచనాలు పెట్టుకోకుండా థియేటర్లకు వెళితే ఒకసారి హ్యాపీగా చూసి రావచ్చు.

---

బుల్లితెరపై సుమ కనకాల స్టార్. ఆమెను ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచయం చేయక్కర్లేదు. అలాగే, నటుడు రాజీవ్ కనకాలను కూడా! వాళ్ళిద్దరి కుమారుడు రోషన్ కనకాల వెండితెరకు పరిచయమైన సినిమా 'బబుల్ గమ్'. తెలుగమ్మాయి మానసా చౌదరికి కథానాయికగా తొలి చిత్రమిది. 'క్షణం', 'కృష్ణ అండ్ హిజ్ లీల' విజయాల తర్వాత రవికాంత్ పేరేపు దర్శకత్వం వహించిన చిత్రమిది. ప్రచార చిత్రాలు ప్రేక్షకుల్ని ఆకర్షించాయి. మరి, సినిమా ఎలా ఉంది?

**కథ :**
ఆది అలియాస్ సాయి ఆదిత్య (రోషన్ కనకాల) కోఠి కుర్రాడు. డీజే కావాలనేది అతడి లక్ష్యం. తండ్రి (జయరామ్ ఈశ్వర్) చికెన్ షాప్ ఓనర్. పబ్బులో జాన్వీ (మానసా చౌదరి)ని చూసి ప్రేమలో పడతాడు. డబ్బున్న అమ్మాయి. ఆమెకు తెలియకుండా వెంట పడతాడు. ఫ్యాషన్ డిజైనర్ కావాలనేది జాన్వీ లక్ష్యం. టర్కీలోని ఫేమస్ కాలేజీలో అడ్మిషన్ రావడంతో ఆరు నెలల్లో అక్కడికి వెళ్ళిపోవాలని అనుకుంటుంది. 'టాయ్స్ (బాయ్స్)తో ఆడుకోవాలి గానీ మనం టాయ్స్ కాకూడదు' అని చెప్పే జాన్వీ... ఆదితో ప్రేమలో ఎలా పడింది? తన పుట్టినరోజు నాడు ప్రపోజ్ చేయాలని రెడీ అయిన జాన్వీ... ఆదిని ఎందుకు, ఎలా అవమానించింది? వాళ్ళిద్దరి మధ్య మనస్పర్థలు ఎందుకు వచ్చాయి? ఆ తర్వాత ఆది ఏం చేశాడు? జాన్వీ ఏం చేసింది? మళ్ళీ వాళ్ళిద్దరూ ఒక్కటి అయ్యారా? లేదా? అనేది సినిమా.

**విశ్లేషణ :**
పాతికేళ్ళు నిండని యువతీ యువకుల్లో ప్రేమ, ఆకర్షణ పట్ల అభిప్రాయాలు మారు ఉంటాయి. ఫైనాన్షియల్ స్టేటస్ బట్టి మనుషులు ప్రవర్తించే తీరు వేరుగా ఉంటుంది. పెరిగిన వాతావరణం, ఆ తర్వాత ఎదురయ్యే పరిస్థితులు అభిప్రాయాలను మారుస్తాయి. దర్శకుడు రవికాంత్ పేరేపు ఈ పాయింట్ తీసుకున్నారు.
పోష్ పోరితో బస్తీ కుర్రాడు ప్రేమలో పడిన కథల్ని తెరపై కొన్ని చూశాం. అయితే, 'బబుల్ గమ్'లో హీరో హీరోయిన్ల కుటుంబ నేపథ్యాలు & వాళ్ళు ఎంపిక చేసుకున్న కెరీర్స్ ఇంతకు ముందు వచ్చిన సినిమాల నుంచి ఈ సినిమాను వేరు చేశాయి. దర్శక, రచయితలు క్రియేట్ చేసిన సెటప్ బావుంది. కానీ, మేకప్ మాత్రం చాలా రొటీన్‌గా ఉంది. అంటే... టేకింగ్ & మేకింగ్‌లో ఉన్న కొత్తదనం సన్నివేశాల్లో లేదు.
యువతకు కావాల్సిన మసాలాలు 'బబుల్ గమ్'లో బాగా దట్టించారు. కానీ, స్టార్ట్ టు ఎండ్ ఎంగేజింగ్ & ఎంటర్టైన్ చేసేలా సినిమాను




తీయలేకపోయారు. క్యారెక్టర్లను పరిచయం చేసిన తీరు బావుంది. తర్వాత సినిమాపై ఆసక్తి కలిగిస్తుంది. అయితే, 'ఆర్ఎక్స్ 100'తో పాటు తెలుగు, హిందీ సినిమాల ప్రభావం సినిమాలో కనిపిస్తుంది. ఒక దశ తర్వాత ఎంత సేపటికీ ముందుకు కదలని ఫీలింగ్ వస్తుంది. 'ఆర్ఎక్స్ 100' అంటూ రాసిన డైలాగ్ సినిమాపై సెల్ఫ్ సెటైర్ అనుకోవాలేమో! ఒక యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌కు కావాల్సిన అంశాలన్నీ 'బబుల్ గమ్'లో ఉన్నాయి. కానీ, ఎంగేజ్ చేసేలా సినిమా లేదు. రొమాన్స్ తప్ప ప్రేమ కనిపించని లవ్ ట్రాక్ ఉన్నప్పటికీ... ఫస్టాఫ్ పాస్ అయిపోతుంది. ఇక, సెకండాఫ్‌లో హీరో ఫోకస్ కెరీర్ మీదకు, హీరోయిన్ ఫోకస్ హీరో మీదకు షిఫ్ట్ కావడంతో చాలా రొటీన్ సన్నివేశాలతో సహనాన్ని పరీక్షిస్తుంది. హీరో హీరోయిన్ల పేరెంట్స్ క్యారెక్టర్లలో కొంచెం కూడా కొత్తదనం లేదు. ఇంటర్వెల్ సీన్ కొత్తగా ఉన్నప్పటికీ... ప్రీ ఇంటర్వెల్ లో హీరోయిన్ కోపానికి, బ్రేకప్ చెప్పడానికి రీజన్ కన్విన్సింగ్ గా అనిపించదు. క్లైమాక్స్ వరకు సెకండాఫ్ పరమ రొటీన్ అనిపిస్తుంది. శ్రీచరణ్ పాకాల స్వరాలు, నేపథ్య సంగీతం ట్రెండీగా ఉంది. హీరోది డీజే క్యారెక్టర్ కావడంతో స్పేస్ తీసుకుని మరీ వెస్ట్రన్ & ఫ్యూజన్ మ్యూజిక్ వినిపించారు. సురేష్ రగుతు కెమెరా వర్క్ బావుంది. నిర్మాణంలో రాజీ పడలేదని సినిమా చూస్తుంటే అర్థం అవుతుంది. కొన్ని సన్నివేశాలకు కత్తెర వేయాలి. నిడివి తగ్గించి ఉంటే... క్రిస్పీగా, స్పీడుగా సినిమా ముందుకు వెళ్ళేది.

**నటీనటులు ఎలా చేశారంటే:**
రోషన్ కనకాలకు ఇది తొలి సినిమా అయినప్పటికీ... కెమెరా ఫియర్ లేదు. ఈజీగా నటించాడు. హైదరాబాదీ యువకుడిగా పర్ఫెక్ట్ సెట్ అయ్యాడు. ఇంటర్వెల్ సీన్, ఎమోషనల్ సీన్లలో కూడా చక్కగా నటించారు. 'బబుల్ గమ్' సినిమా నటుడిగా రోషన్ కనకాలకు మంచి డెబ్యూ. అయితే, వయసుకు మించిన పాత్ర చేశారనిపిస్తుంది. గ్లామర్ & పెర్ఫార్మన్స్... రెండూ ఉన్న అమ్మాయి మానసా చౌదరి. తొలుత అందం, ఆ తర్వాత అభినయంతో ఆకట్టుకుంది. పతాక సన్నివేశాల్లో ఆమె నటన చాలా సహజంగా ఉంది. రోషన్, మానస మధ్య కెమిస్ట్రీ కుదిరింది. లిప్ లాక్స్, రొమాన్స్ చూస్తే ఇద్దరు ప్రేమికులు సహజంగా చేసినట్టు ఉంది. రోషన్ కనకాల తండ్రిగా జయరామ్ ఈశ్వర్ (చైతు జొన్నలగడ్డ) నటన గానీ, డైలాగ్ డెలివరీ గానీ, కామెడీ టైమింగ్ గానీ సూపర్. నిజం చెప్పాలంటే... తండ్రిలా కాకుండా పెద్దన్నయ్యలా కనిపించారు. ఆయన డైలాగులకు విజిల్స్ పడతాయి. హీరో తల్లి పాత్రలో బిందు చంద్రమౌళి, హీరోయిన్ తల్లిదండ్రులుగా అనూ హాసన్, హర్షవర్ధన్ తమ పాత్రల పరిధి మేరకు చక్కగా చేశారు. హీరో స్నేహితులుగా కనిపించిన ఇద్దరూ కొన్ని సన్నివేశాలు నవ్వించారు. హర్ష చెముడు క్యారెక్టర్ అంతగా క్లిక్ కాలేదు. అతడిని సరిగా వాడుకోలేదు. బ్రహ్మానందం ఓ సన్నివేశంలో తళుక్కున మెరిశారు.

**చివరగా చెప్పేది ఏంటంటే:**
'బబుల్ గమ్' నోటిలో వేసుకున్నప్పుడు... మొదట ఆ ఫ్లేవర్ రుచి తగులుతూ బావుంటుంది. కాసేపటికి రుచి తగ్గి సాగుతూ ఉంటుంది. ఈ సినిమా కూడా అంతే! ప్రారంభంలో కొత్తగా కనిపిస్తుంది. తర్వాత నుంచి నిదానంగా సాగుతుంది. ఏమాటకు ఆ మాటే చెప్పుకోవాలి... రోషన్, మానస, జయరామ్ ఈశ్వర్ నటన సూపర్బ్! న్యూ ఏజ్ & ట్రెండీ యూత్, మల్టీప్లెక్స్ ఆడియన్స్‌లోనూ కొందరికి మాత్రమే నచ్చే చిత్రమిది.

(గమనిక: వ్యక్తిగత జాతకము అనగా వ్యక్తి పుట్టి నపుడు అతని సమయం, స్థలం, జన్మ వివరాలు ఆధారముగా నిర్మించిన జన్మకుండలి ప్రకారము వ్యక్తికి నడుస్తున్న దశలు, అంతర్దశలు ప్రధానము. గోచారం ఫలితాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు)

నిర్వహణ :
స్వర్ణకంకణ సన్మానిత, జ్యోతిష్య మాడమణి, జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద
డా॥ఈడ్పుగంటి పద్మజారాణి
91 9849250852, 91 7506976164
padma.suryapaper@gmail.com



# 31.12.2023 నుంచి 6.1.2024 వరకు



## మేష రాశి

అశ్విని 1,2,3,4 పాదములు , భరణి 1,2,3,4 పాదములు కృత్తిక 1వ పాదము

సంవత్సరం ప్రారంభం విందు వినోదాలతో, ఆహ్లాదకరంగా సంతోషంగా స్నేహితులతో బంధుమిత్రులతో ప్రారంభమవుతుంది. గృహ వాతావరణం ఉత్సాహంగా ఉంటుంది. ఆరోగ్యం బాగుంటుంది. సంతాన విద్య అభివృద్ధికి సంబంధించిన విషయాలు వింటారు. ఆలోచనలు ఉద్వేగ పూరితంగా ఉన్నప్పటికీ ఫలవంతంగా ఉంటాయి. ఆకస్మిక బహుమానాలు అందుకుంటారు, భాగస్వామ్ కి సంబంధించి కొత్త నిర్ణయాలు ఆశాజనకంగా ఉంటాయి. వారం మధ్యలో అధిక శ్రమ, నూతన బాధ్యతలు, పోటీలలో విజయం కొరకు చేయి ప్రయత్నాలు, పూర్వ రుణాలు చెల్లిస్తారు, బంధుమిత్రుల రాకతో సందడి వాతావరణం. దీర్ఘకాలిక అనారోగ్యాల నుంచి ఉపశమనం పొందుతారు. మీ కుటుంబములోని పెద్దలు తీర్థయాత్రలు చేయడానికి సంకల్పిస్తారు.



## వృషభరాశి

కృత్తిక 2,3,4 పాదములు ,రోహిణి 1,2,3,4 పాదములు మృగశిర 1,2 పాదములు

వారం ప్రారంభంలో తల్లి ఆరోగ్య ఆదాయం అభివృద్ధి కరంగా ఉంటుంది. వాహనము కొరకు, గృహ నిర్మాణం కొరకు ప్రయత్నాలు చేస్తారు. విద్యార్థులు విద్యాపరమైన అంశములు మీద శ్రద్ధను పెంచుకోవాలి. వ్యవసాయ అంశములు అనుకూలంగా ఉంటాయి. మిత్రులతో అనుకూలంగా ఉంటుంది. వృత్తిపరంగా దూర ప్రదేశాలలో తోబుట్టువులకు నూతన అవకాశములు. మీ సహకారం ఉంటుంది వారికి. వారం మధ్యలో స్నేహితులతో అభిప్రాయ బేధం రాకుండా జాగ్రత్త పడాలి. ఎంతోకాలం ఎదురుచూస్తున్న దూర ప్రదేశంలో నుంచి అందుకున్న ఒక వార్త ఆనందాన్నిస్తుంది. విదేశీ ప్రయత్నాలు చేస్తారు. ఉపాసన బలాన్ని పెంచుకోవడానికి చేసే ప్రయత్నాలు కొంతవరకు అనుకూలంగా ఉంటాయి.



## మిధున రాశి

మృగశిర 3,4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు పునర్వసు 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో మిత్రులల సహకారం ఆశించిన విధముగా అనుకూలంగా ఉంటుంది ధైర్యము, పరాక్రమం పెరుగుతుంది. నిర్ణయాలు ధైర్యంగా తీసుకుంటారు. ఆదాయము అనుకూలంగా ఉంటుంది. కుటుంబ వాతావరణం సందడిగా ఉంటుంది. దగ్గర ప్రయాణాలు చేస్తారు. వారము మధ్యలో గృహ వాతావరణం, ముఖ్యంగా తల్లి ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. విద్యార్థులు విద్య మీద ఆసక్తి పెంచుకోవాలి. గృహ వాహన సంబంధ అంశము లలో చిన్నపాటి రిపేర్లకు మరమ్మతులకు అవకాశం. వృత్తిపరంగా అధిక బాధ్యతలు శ్రమ ఉన్నప్పటికీ మీరు సమయానికి మీ పనిచేసే ఉన్నత అధికారుల ప్రశంసలను పొందుతారు. దానివలన వృత్తిపరమైన అలసట,



## కర్కాటక రాశి

పునర్వసు 4వ పాదము పుష్యమి 1,2,3,4 పాదములు ఆశ్లేష 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. చాలాకాలంగా చూస్తున్న రావలసిన ఆదాయమును అందుకుంటారు. యదార్థవాది బంధు విరోధి అన్నట్లుగా మాట్లాడే మాట నిక్కచ్చిగా ఉండటం వల్ల కొందరు ఇబ్బంది పడే అవకాశం ఉంది. కొన్ని పనులలో ఆటంకాలు ఆలస్యాలు ఉన్నప్పటికీ పట్టుదలగా వెళ్లే ప్రయత్నాలు. మాట విలువ గౌరవం పెరుగుతుంది నూతన వృత్తి కోసం ప్రయత్నం చేసే వారికి చాలా వరకు అనుకూలంగా ఉంటుంది. సంతాన అభివృద్ధి కొరకు కొత్త ప్రయత్నాలు చేస్తారు. వారి కొరకు సమయాన్ని కేటాయిస్తారు. వారం మధ్యలో వ్యక్తుల సహకారం పెరుగుతుంది. నిర్ణయాలు తీసుకుంటారు. వాటిని అమలు చేయడము లో చేసే ప్రయత్నాలు అనుకూలంగా ఉంటాయి. ఆధ్యాత్మిక వ్యక్తుల సహకారం అనుకూలం



## సింహ రాశి

మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు ఉత్తర 1వ పాదము

వారం ప్రారంభ ఉత్సాహంగా ఉల్లాసంగా ఉంటుంది. మనసులోని కోరికలన్నీ నెరవేర్చుకోవడానికి కృషి చేస్తారు. ఆరోగ్యం బాగుంటుంది. శారీరక శ్రద్ధ, అలంకరణమీద ఆసక్తి పెరుగుతాయి. భాగస్వామితో కలిపి నూతన నిర్ణయాలు తీసుకుంటారు. దూర ప్రయాణానికి సంకల్పం చేస్తారు. ఆ కస్మికమైన ఖర్చులు ఉంటాయి. వ్యక్తిగత సంతోషం కొరకు అధికమైనప్పటికీ ఆనందాన్నిస్తాయి. ఇతరులకు రుణములు ఇస్తారు. సంతానపరమైన అంశములలో అభివృద్ధికి సంబంధించిన విషయాలు ఆలోచన రేకెత్తి స్థాయి. గృహ ఆదాయం బాగుంటుంది. తల్లితర బంధువుల నుంచి రాకపోకలుంటాయి. బహుమానములు అందుకుంటారు. నూతన వాహన కొనుగోలు కొరకు తోబుట్టువులతో సంప్రదిస్తారు.



## కన్యా రాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు చిత్త 1,2 పాదములు

వారం ప్రారంభం అధిక ఖర్చులతో మొదలైనప్పటికీ అవి ఉపయోగకరంగా ఉంటాయి. ఆత్మసంతృప్తిని వ్యక్తిగత అభివృద్ధిని కలిగిస్తాయి. ఆధ్యాత్మిక ఆలోచనలతో సంవత్సరాన్ని స్వాగతం పలుకుతారు. కుటుంబంలో భాగస్వామితో అన్యోన్యతను పెంచుకోవడానికి ప్రయత్నాలు చేయాలి. మాట పట్టింపులు లేకుండా, వాగ్వాదములకు చోటు ఇవ్వకుండా ముందుకు సాగాలి.కొత్త వ్యక్తుల పరిచయాలు. లాభాలు వచ్చినప్పటికీ వాటిని దుర్వినియోగము కాకుండా అనుకూలంగా మరల్చుకోవడానికి ప్రయత్నములు చేయాలి. వారము మధ్యలో ప్రతి విషయంలోనూ మానసికంగా ఆందోళన, వైరాగ్యంగా ఆలోచనలు ఉన్నప్పటికీ అధిగమించే ప్రయత్నం చేయాలి. సంతానము అభివృద్ధి కొరకు ఆలోచిస్తారు. వ్యవసాయ సంబంధ అంశములు మీద దృష్టి పెడతారు.



## తులారాశి

చిత్త 3,4 పాదములు స్వాతి 1,2,3,4 పాదములు , విశాఖ 1,2,3 పాదములు

సంవత్సరం ప్రారంభం సంతోషంగా శుభవార్తలతో వృత్తిపరమైన అభివృద్ధితో, మొదలవుతుంది. కుటుంబ సభ్యులతో సంతానంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో, చిన్ననాటి స్నేహితుల పలకరింపులతో ఉత్సాహంగా గడుస్తుంది. ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శిస్తారు. తండ్రి నుంచి, దూర ప్రదేశాల నుంచి విలువైన బహుమానాలు అందుకుంటారు. వృత్తిలో గౌరవం, ఆదాయపరమైన పెరుగుదల, ఆశించిన ప్రదేశములకు స్థానచలనమునకు ప్రయత్నాలు అనుకూలంగా ఉండడం ఆనందాన్ని స్థాయి. వారం మధ్యలో వృత్తిపరంగా నూతన బాధ్యతలు ప్రయాణాలు, కొత్త వ్యక్తుల కలయిక, శ్రమ బడలిక ఉన్నప్పటికీ చలాకీగా వాటిని అధిగమిస్తారు. ఆధ్యాత్మిక పుణ్య క్షేత్ర సందర్శనతో, నదీ స్నానాలు, గురువులను కలవడం వారి ఆశీస్సులు తీసుకోవడం,



## వృశ్చిక రాశి

విశాఖ 4 పాదము అనురాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో వృత్తిపరంగా అధిక బాధ్యతలు శ్రమ ఉంటాయి. గౌరవం పెరుగుతుంది. ఇతరులకు సహకరిస్తారు. వృత్తిపరంగా ఉన్నత అధికారుల సహకారంతో పనులు నెరవేరుస్తారు. నూతన విషయాలు నేర్చుకుంటారు. సమయమునకు తగిన ఆహార స్వీకరణ అవసరము. భూమికి సంబంధించిన అంశములలో కొంత ఘర్షణాత్మకంగా ఉంటుంది. తోబుట్టువులతో నిదానమవసరం. నూతన బాధ్యతలు అధికముగా ఉండటం వల్ల ఆరోగ్యపరంగా కొంత ఇబ్బంది పడతారు. వారం మధ్యలో ఒక వార్త ఘర్షణతో కూడిన ఆనందాన్నిస్తుంది. మిత్రులతో సన్నిహితులతో కలిసి చర్చిస్తారు. ఆత్మీయుల సహకారంతో కోరుకున్న విషయంలో పనులు ముందుకు సాగుతాయి. భాగస్వామి సంబంధ అంశాలు ఒక్కలికి వస్తాయి. దగ్గరలో ఉన్న పుణ్యక్షేత్రాన్ని సందర్శిస్తారు.



## ధనస్సు రాశి

మూల 1,2,3,4 పాదములు పూర్వాషాఢ 1,2,3,4 పాదములు ఉత్తరషాఢ 1వ పాదము

వారం ప్రారంభం అధిక ఖర్చులు ఉన్నప్పటికీ, అవి సంతోషాన్ని , ఉపయోగపడ్డాన్ని సూచిస్తున్నాయి. విద్యా పరంగా అభివృద్ధి పరంగా ఉంటుంది. పెద్దలు గురువుల ఆశీస్సులతో ముందుకు సాగుతారు. ఆత్మీయ వ్యక్తుల సహకారం మీకు మనోధైర్యాన్ని ఇస్తుంది. విదేశీ ప్రయత్నం చేయువారికి చాలా వరకు అనుకూలంగా ఉంది. సంతానానికి అభివృద్ధి కరంగా, విదేశీ పరమైన విద్యకి అవకాశంగా సూచనలు ఉన్నాయి. వారం మధ్యలో వృత్తిపరంగా కొంత అధిక శ్రమకు, అపార్థములకు, నూతన బాధ్యతలకు అవకాశము ఉంది. వృత్తిపరమైన వైరాగ్యంతో తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదు. వృత్తిపరముగా సంబంధం లేని వ్యక్తుల విమర్శలు చికాకును కలిగిస్తాయి. వాహనములను నడిపేటప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.



## మకర రాశి

ఉత్తరషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు ధనిష్ఠ 1,2 పాదములు

వారం ప్రారంభంలో ఆరోగ్యంపై శ్రద్ధ అవసరము. ముఖ్యమైన విషయాలలో ప్రయాణాలలో వాయిదాలకి అవకాశం ఉంది. ప్రయాణాలలో చికాకులు, నూతన వ్యక్తుల పరిచయాలు ఇబ్బంది కలిగించినప్పటికీ ఆత్మ బలముతో వాటిని జయిస్తారు. తోబుట్టువులతో ఆత్మీయులతో విభేదాలు రాకుండా వీలైనంతవరకూ మౌనం పాటించటమేలు. ఆకస్మిక ఖర్చులు అధికంగా ఉంటాయి. వారం మధ్యలో భాగస్వామికి ఆరోగ్యపరంగా శ్రద్ధ తీసుకుంటారు. ఆగిన పనులు ముందుకు సాగుతాయి. గురువులని పెద్దలని కలిసి ఆశీర్వచనం తీసుకుంటారు. ఆధ్యాత్మిక క్షేత్ర పర్యటన ఆనందాన్నిస్తుంది. వారం చివరిలో భాగస్వామ్య వ్యాపారాలలో అనుకూలంగా ఉంటుంది. జీవిత భాగస్వామికి వృత్తిపరమైన అభివృద్ధి.



## కుంభ రాశి

ధనిష్ఠ 3,4 పాదములు శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో జీవిత భాగస్వామితో అనుకూలమైన చర్చలు చేస్తారు కుటుంబ వార్తలను ఆహ్లాదకరంగా ఉంటుంది కొత్త నిర్ణయాలు తీసుకుంటారు వ్యక్తిగత శ్రద్ధ, రోగనిరోధక శక్తి పెరుగుతాయి. పాత బాకీలు వసూలు అవుతాయి. పనులలో ఆలస్యాలు ఆటంకాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత విభేదాలు రాకుండా సంయమనం పాటించాలి. ఆత్మీయ సోదర వర్గం సహకారం అనుకూలంగా ఉంటుంది. వారం మధ్యలో ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకోవాలి ఆకస్మిక ఖర్చులు చికాకులు కలిగిస్తాయి. దీర్ఘకాలికి పెట్టుబడులు పైన ఆసక్తి ఉండదు. మాటల విషయంలో కంటి విషయంలో జాగ్రత్తలు అవసరం. ఉన్నది ఉన్నట్లు మాట్లాడటం వల్ల ఇతరులు అపార్థం చేసుకునే అవకాశం ఉంది. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. ప్రయాణాలలో వస్తువులు జాగ్రత్తగా పెట్టుకోవాలి,



## మీనరాశి

పూర్వాభాద్ర 4 వ పాదము ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు రేవతి 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో సంతానముతో, ఆత్మీయ వ్యక్తులతో ఆహ్లాదకరంగా గడుపుతారు.రోగనిరోధక శక్తిని పెంచుకోవాలి. ఉన్నత వ్యక్తులని కలుస్తారు. వారి ఆశీస్సులు తీసుకుంటారు. మీ ఆలోచనలు బాగుంటాయి సృజనాత్మకత బాగుంటుంది. అనుకున్న విషయాలు సత్ఫలితాలు నిస్తాయి. ఇంతకుముందు రుణములు తీసుకున్న వారి చెల్లిస్తారు. వారం మధ్యలో భాగస్వామ్య సంబంధాలు ఇబ్బంది పెట్టకుండా, అపార్థాలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వృత్తిపరమైన అంశములలో, సామాజిక సంబంధాలలో వైరాగ్య భావనల అధికంగా ఉంటాయి. వాటిని అధిగమించే ప్రయత్నాలు చేయాలి. భాగస్వామి ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వాగ్వాదములకు దూరంగా ఉండాలి. అంశాలలో ఆధ్యాత్మిక అభివృద్ధి కొరకు ప్రయత్నాలు


మౌని రాయ్